536 Talli. Re. No. M. 3748.

01 JAN 193



సంపుటము 1. | చిత్తూరు: 1937 సం॥రం డిశంబరు నెల. | సంచిక 7.


తేటమాటల నీటగు - తెనుఁగుతల్లి
తేనెలొలుకు పల్కులుగల - తెనుఁగుతల్లి
తెలివి తేటలఁ గల్గించు - తెనుఁగుతల్లి
తెనుఁగు బిడ్డలు, కొలువుఁడీ - తెనుఁగుతల్లి.

కుమారదేవ,
సంపాదకుఁడు.

INGH, at his Dt. Printing Works, Chittoor.
by KUMARADEVA, CHITTOOR.

# విషయసూచిక.


| | | | | పేజీలు. |
|---|---|---|---|---|
| 1 | వేంకటేశ్వర స్తవము | ... | ... | 331 |
| 2 | ఆంధ్రజాత్యైక్యము ... | ... | ... | 332 |
| 3. | పత్త్రికా ప్రశంస, శిశువునకు పండ్లు ఎప్పుడు వచ్చును? | | | 334 |
| 4. | కుమార సంభవము | ... | ... | 337 |
| 5. | ప్రేమలేని సతీపతుల సాంగత్యము, ఘోష | | ... | 341 |
| 6 | కర్షక స్థితి ... | ... | ... | 343 |
| 7. | ఉపాధ్యాయుల దుస్థితి | ... | ... | 344 |
| 8 | మారటోరియము ... | ... | ... | 345 |
| 9. | ప్రాథమికవిద్య ఎట్లుండవలెను? | ... | ... | 351 |
| 10. | చిన్నికథ ... | ... | ... | 356 |
| 11. | గణిత చిత్రప్రశ్నలు | ... | ... | 362 |
| 12. | విజ్ఞానము ... | ... | ... | 363 |
| 13. | నాగసర్పము పైపుత్రవాత్సల్యము | ... | ... | 364 |
| 14. | లోకజ్ఞానము ... | ... | ... | 365 |
| 15. | ఋతుచిహ్నము ... | ... | ... | 312 |
| 16. | నెలదినములు ... | ... | ... | 367 |
| 17. | తెనుఁగుతల్లి పోటీపరీక్ష నెం 2 | ... | ... | 399 |
| 18. | నానాదేశ వార్తావళి | ... | ... | 371 |
| 19. | రంగులరాట్నము ... | ... | ... | 374 |
| 21. | నెల పంచాంగము | ... | ... | 376 |





# తెనుఁగుతల్లి.

సమస్త విజ్ఞాన దాయకములగు విషయములఁ జర్పించు

సచిత్ర మాసపత్త్రిక.

| | | | |
|---|---|---|---|
| సంస్థాపకులు | రూ. | 116—0—0 | అంతకుపై. |
| సముద్ధారకులు | ,, | 50—0—0 | ,, |
| సంరక్షకులు | ,, | 25—0—0 | ,, |
| సంస్కారకులు | ,, | 10—0—0 | ,, |
| సభ్యులు సంIIకు | ,, | 5—0—0 | ,, |
| చందాదారులు ,, | ,, | 1—0—0 | |

చిరునామా:— మేనేజరు,

"తెనుఁగుతల్లి" ఆఫీసు, చిత్తూరు.

మ-రా-రా-శ్రీ; చిత్తూరు జిల్లాకోర్టువారి సముఖమునకు.

---

O. P. 33/1937.

Between

సారాయి అలిగాదమ్మ ... మనువుదారు.

And

సారాయి వాగమ్మ ... రెస్పాండెంటు.

యీ నెంబరులో మనువుదారి చనిపోయిన తనభర్త S. తంగవేలుమొదలికి రావలశ్ని ఓరియంటల్ గవర్మెంటు సెక్యూరిటి లైఫ్ యిన్సురెన్సి కంపెనిలో పాలిసి నెం. 499046 మొత్తము రూపాయలు 750—0—0 ను తీయుటకుగాను పై కోర్టులో వార్సు సర్టిఫికేటు కావలయుననికోరి పై మనువు పై కోర్టులో 8—12—1937 తేది వాయిదా వేశి యుండుటవల్ల మనువుదారికి వార్సు సర్టిఫికేటు పొందువిషయములో ఆక్షేపణలు యున్నవారు వాయిదాదినము పగలు 10 గంటలుకు హాజరై ఆక్షేపణలును నేరుగాగాని వకీలు ద్వారాగాగాని తెలియపరచుకోవలెను.

M. CHENGA REDDI,
*Vakil for Petitioner.*
24—11—1937.

# వేంకటేశ్వరస్తవము.

జె. కృష్ణరావుగారు.

శా॥ ఆనందాత్మకమూర్తివై తనరునీ - యస్తోకహృద్వీథిఁబ
ద్మానారీమణిలీలనివ్వటిలుసాం - ద్రప్రేమసారంబువి
శ్వానీకంబులఁగ్రమ్మదేనియవితృ - ట్యర్థంబులోఁడుల్లవే
జ్ఞానాతీతముప్రేమసత్త్వము, రగేం - ద్రక్షోణిభృన్నాయకా!

ఉ॥ హామకభూషణోజ్జ్వలిత - హాళిగళానసచారువక్షవీ
క్షామతినిల్చిమోహితులు - గాకుఁడుమీఁరపవర్గదాయకం
భీమహితాంఘ్రియుగ్మమని - పర్వడఁజూపుదుభక్తకోటికిఁ
బ్రేముడిఁగొల్వదక్షిణప - విత్రకరాంగుళి వేంకటేశ్వరా!

తే-గీ॥ నిండుజాబిల్లిపండువె - న్నెలలఁబోలు
నీకృపారాశి భువియెల్ల - నెరసిశరణ
చిత్తకైరవముల విక - సింపఁజేయు
భక్తి తివియంగ లోఁబర్వి - పరమపురుష ॥

---

# ఆంధ్రజాత్యైక్యము.

---

## వ్యావహారికాంధ్రము.

ఆంధ్రరాష్ట్ర నిర్మాణమునకై యాందోళనము హెచ్చు గుచునే యున్నది. ఆంధ్రభాష మాటలాడు వారందఱకు నొక రాష్ట్రము కావలయునని పరుగిడువారు హిందీప్రవాహ మునకు దాసోహమ్మను చుండుట స్వవచన వ్యాఘాతమో లేక స్వోదరపూరణ క్రియాతురులై రానున్న పదవుల కొల్ల గొనుటయో కావలయును. అది పోనిండు, నేటి ఆంధ్రభాష ను బరిశీలింతము. వ్యవహారము నడపుటకనియు అసలు భా షయనియు వాదుచుండెడి "వ్యావహారికాంధ్రము"ను బరిశీ లింతము. ఆభాష యేమండలమువారిది? ఏయేమండలము లద్దాని నవగతముచేసికొని యుల్లే వ్యవహారించుచున్నది? ఎన్ని మండలము లందు బాగ్గొనుచున్నవి? ఎన్నిదూరమగుచున్నవి? ఏకీభావమని తైతక్కలాడుచున్న నాయకులెందఱ కీవిషయ ము స్ఫురించినది?

తెనుఁగువారి బాసమండలమున కొక్కొక తెలుఁగు వ్యావహారికమున వికృతినందియున్నది. అట్టి వానిని క్రోవు చేసి పరీక్షించిన వివిధమండల గతములైన భాషల విభేదము స్థూలముగనే గన్పట్టును. ఒక్క మండలమువారి వ్యావహారి కము మఱొక్కనికిఁ గొసటబీసటగఁ గన్పట్టును. అట్లునప్పు

డాంధ్రు లేకీభవింపవలయుననియు నందునను భాషావిషయమున నైకమత్యము కలుగవలయుననియు నాందోళనచేయుట హాస్యాస్పదము. ఇంటగెలిచి రచ్చగెలువవలయును. తొలుత భాషను సంస్కరించి, యేదేదెంతవఱకు ననుసరణీయమో అద్దాని ననుష్ఠించుటకుఁ గడంగవలయును. అందుమూలమున నైకమత్యమును సాధింప నెంచవలయునుగాని మావైపిట్లే యనెదమనియు మీరు వ్రాయునది కృతకాంధ్రమనియు మీకాంధ్రత్వము లేదనియు వాదోపవాదములకు దిగుట సంఘీభావమున కధోగతి కల్పించుటేయగును. కావున మాయుద్దేశమున గ్రాంధికాంధ్ర మిదివఱకనేక శతాబ్దములుగ సర్వజనాదరణీయముగ నుండెననియు నద్దానినే యిదివఱ కొకరికొకరికి భాషావిషయమున ద్వేషాదులు జనింపకుండి జాత్యైక్యమునకు మూలాధారముగ నుండినదనియు నిప్పుడొకరినొకరు సందేహదృక్కులఁ జూచుకొనుటకు స్వార్థపరులును, భాషాస్వాతంత్ర్యమను నపోహామార్గమును బట్టిన ఆంధ్రమ్మన్యులే కారణమనియు స్పష్టపఱచుచున్నాము.

ఎంతకాల మీభాషావిషయమున నొక్కదారి యేర్పడక ధనముగలిగి పత్రికాదులనడపి ప్రచారము సాగించుటకనువైనవారిచే నాంధ్రలోకము పెడదారికిద్రిప్ప ప్రయత్నము సాగుచుండునో అంతకాలము తెనుఁగుజాతికి ఏకీభావము కుదురదని ఘంటాపథముగ నొక్కి చెప్పగలము.

---

# పత్త్రికాప్రశంస.

ఉభయభాషా ప్రవీణ అయ్యాదొరాచార్యకవి.

చెలఁగి వాగ్దేవికిరు కేలంకులను దెనుఁగు
సంస్కృతంబులు కవలుగా శరణుఁబొంద
నిర్వురను బ్రీతినామె మన్నించెననఁగఁ
దెలియుముఖ చిత్రమునొప్పెఁ దెనుఁగుతల్లి.

ముందుజూచిన పత్త్రిక యందుఁ దెనుఁగు
తల్లిసంతానశూన్యయై తనరులోప
మడఁచికొనె సంస్కృతాంధ్రంబు లమరుకతన
భావిసౌభాగ్యవృద్ధికిఁ ద్రోవయిదియె.

తెనుఁగువారల నిటుచేరఁదీసికొనుచు
పెక్కుబిడ్డలతల్లియై పేరుపొంది
"తెనుఁగుతల్లి" యనెడుపేరు తేటగాఁగ
సార్థకము చేసికొను నింక సత్యముగను.

---

# శిశువునకు పండ్లు ఎప్పుడు వచ్చును?

సర్వ సాధారణముగా మొదటిపల్లు అయిదు ఏడు నెలల మధ్యను వచ్చును. మొదటిపల్లు వచ్చిన కొలది రోజులలోనే రెండునపల్లుకూడ వచ్చును.

కొన్నివారములు గడచిపోవును. అనగా నింక మూడు నాలుగు నెలలలో శిశువు మొదటి సంవత్సరము పూర్తి అగునన్నమాట. అప్పటికి పై దవడమీద మూడు లేక నాలుగు పండ్లు కనిపించును.

తల్లులు తమపిల్లలకు కొంకిరిపండ్లు, అడ్డ దిడ్డమయిన పండ్లు, ముక్కు-పండ్లు, ఎగుడు దిగుడుగానుండు పండ్లు ముఖవర్చస్సును మంటగలిపేపండ్లు వచ్చునేమోయని యెంతో భయపడుచుందురు.

చక్కని పలువరుసయే ముఖానికి అందమును కూర్చును. అట్టి విషయములో తల్లి భయపడునన్నచో నే చోద్యము లేదు.

ఇంకను, శిశువు ఆడుపిల్ల అయినచో ఆమె భయము అధికముగ నుండును. తన కూతునకు ఎట్టి అనాకారము ప్రాప్తమవునో అని దిగులు చెందును.

అందుచేత, తల్లులు తమశిశువుల పండ్లవిషయములో చాల జాగ్రత్త తీసికోవలెను.

శిశువు పండ్లవిషయములో ఎప్పటినుండి జాగ్రత్త పడవలయునను విషయము చాలామంది తల్లులకు అగమ్యగోచరము. బిడ్డపండ్ల విషయము మాత, బిడ్డ జననము కాకపూర్వము నుండి శ్రద్ధ వహించవలెను. బిడ్డపండ్లు అందముగాను ఆరోగ్యముగాను ఉండవలెనన్నచో తల్లి తనపండ్ల విషయములోను తన ఆహారవిషయములలోను సరియయిన నియమములను పాటించవలెను.

## ఎప్పటినుండి ?

గర్భధారణ మొనరించిన నాటినుండి మాత తనకు జన్మించబోవు బిడ్డ పండ్లు సరిగను అందముగను ఉండవలెనని కోరిన, గర్భ విషయము తెలియగానే దంతవైద్యుని వద్దకు పోవలెను. దంతవైద్యునిచేత తన పండ్లును నోటిని శుభ్రము చేయించుకోవలెను.

## ఇక ఆమె ఆహారము.

క్రొత్త పండ్లు. ఆకు కూరలు. పాలు.

క్రొత్తఫలములను ఎక్కువగా తినుట మంచిది. వంటకములో తరుచు ఆకు కూరలే ఉపయోగించుట మేలు. ఆకుకూరలలో కాల్షియమ్ (Calcium) అమితముగా నుండు ఆకుకూరలు మరీయు మంచివి. పాలు మితముగా తీసికొనుచు నుండవలెను.

మిగత మినరల్ సాల్టులు అవసరమయినవి. కాల్షియము (Calcium) ఎక్కువగానుండు ఫలములు. నారింజపండ్లు. ఆపిల్సు. ఎండబెట్టిన రేగుపండ్లు.

తల్లి గర్భిణిఅయిన నాటినుండి భోజనము చేసిన తడవుగా పండ్లు శుభ్రముగా కడుగుకొనవలెను. నోరు పరిశుభ్రముగా నుంచుకోవలెను. ఈ ముందు జాగ్రత్తలన్నియు శిశువుకొఱకే కాక, తల్లికొఱకు కూడ నుపయోగము.


బిడ్డకు వాడిఅయిన పన్నుకొన బయటకు రాగానే కొద్దిగా బాధ పెట్టును. అందుచేత పన్ను బయటకు వచ్చుటకు నలువది ఎనిమిది గంటలు ముందుగా శిశువు ఏడ్వడము పోరుపెట్టడము మొదలుపెట్టును. పెద్దవారు పంటినూడ పీకించుకొన్న నెంతబాధ పెట్టునో, శిశువుకు పన్ను ఉద్భవమగునప్పుడు కూడ అంతబాధ పెట్టును.

నలువది ఎనిమిది గంటలనుండి బిడ్డకు సరిగా నిద్రపట్టదు. బాధ శిశువును లేపుచుండును. పాలవలన బిడ్డ సంతృప్తిపడి, ఏడుపు మాని వేయదు.

ఆ సమయమున పాలు త్రాగుమని నిర్బంధించుట కూడ మంచిది కాదు. తక్కువపాలు పెట్టడమే మంచిది.

కాచిన వేడినీరు చల్లారపెట్టి యిచ్చుట మంచిది. ఆనీటిలో పంచదారగాని, మరియే తీపి పదార్థముగాని వేయకూడదు. ఆ నీరు బిడ్డకు వేడి తగులకుండ చేయును.

డాక్టరు సలహా తీసికొనకుండా, పండ్లు రాలేదను తొందరలో ఆయింట్మెంట్లు దేనిని ఉపయోగింప కూడదు.



# కుమార సంభవము. (అనువృత్తము)

పూతలపట్టు శ్రీరాములురెడ్డి.

## తృతీయ సర్గము.

తే-గీ॥ మనసు తొమ్మిది త్రోవల - మరలనీక
నియమమున హృదయంబున - నిలిపి యెవని
నరయుదురు క్షేత్రవేత్త ల - వ్యయుని గాఁగ
నట్టి పరమాత్మఁ దనయందఁ - యరయువాని. ౨౦

తే-గీ॥ మనసుచేనైన నుంతయుఁ - జెనక రాని
వాని ముక్కంటిఁ దనసమీ - పమునఁ గాంచి
స్మరుఁడు భయమున వివశమై - జాఱినట్టి
చేతి శర చాపములను ల - క్షింపఁడయ్యె. ౨౧

తే-గీ॥ అంత నెక్కువ యాఱిన - కంతు బలము
మరలఁ దనమేని సౌందర్య - మహిమఁ జేసి
పెంపు వొందించు నదివోలె - సొంపు మీఱ
వచ్చె వనదేవతలతో, న - పర్ణయటకు. ౨౨

తే-గీ॥ పద్మరాగంబులను గేరు - వంజుళముల
కనక కాంతిని నగు కర్ణి - కారములను
సిందుకముల ముత్తె సరిగఁ - జెక్కి వనవ
సంత పుష్పాభరణయయి - చాల నొప్పి. ౨౩

తే-గీ॥ కుచభరంబున నించుక - క్రుంగి నట్లు
బాలసూర్యరాగంబైన - వలువయొప్ప
కమ్ర పుష్ప గుచ్ఛములచే - నమ్ర యగుచుఁ
బల్లవిత లత నడతెంచు - పగిది నలరి. ౨౪

తే-గీ॥ స్థానవిదుఁడు మన్మథుఁడు న్యా - సముగ నుంచి
నట్టి రెండవనారి నా - నలరు పొగడ
దండ మొలనూలు పిఱుఁదుల - నుండి జాఱి
మాటి మాటికిఁ జేతితో - మాఁటికొనుచు. ౨౫

తే-గీ॥ తావి గుబులు మూర్పుల చేతఁ - దమిని జెంది
బింబ ఫలమును బోలు కెం - పెదవిచెంత
దిరుగు నళిని సంభ్రమలోల - దృష్టిఁజూచి
వెడలఁదోలుచు లీలార - విందమునను. ౫౬

తే-గీ॥ రతియు లజ్జచే మొగమును - వ్రాల్పఁదగిన
చందమున నొప్పు సర్వాంగ - సుందరి గిరి
జాతఁగనఁ గోర్కి మొలకెత్తె - స్మరున కపుడు
శివు జితేంద్రియునెడఁ గార్య - సిద్ధిఁగూర్చి. ౫౭

తే-గీ॥ పార్వతియు భావిభర్తయౌ - భవు సమీప
మునకు వచ్చెను; బరమాత్మ - యనెడు సంజ్ఞ
గలుగు జ్యోతిని దనలోనఁ - గాంచి శివుఁడు
యోగమున నుండి, యుపరతి - నొందెనపుడు. ౫౮

క॥ అహి వల్లభుఁ డొక్కించుక
తహతహపడ భూభరంబు - తలచగునట్లా
యహివలయుఁ డూర్పు లొయ్యన
వహియించెను విడిచె వీర - బంధము నంతట. ౫౯

తే-గీ॥ నంది పరమేశ్వరునకు వం - దన మొనర్చి
సేవనార్థమ్ము నగజ వ - చ్చినది తెలిపి
యతని భ్రూక్షేప మాత్ర న - ఖ్వ్యత మెఱింగి
యామెను బ్రవేశపెట్టించె - నప్పు డతఁడు. ౬౦

తే-గీ॥ నగజ తానుగాఁ గోసిన - నవ వసంత
సుమవనంబుఁ బ్రవాళఖం - డముల తోడ
నామె చెలులు మున్నుగ విన - యమున మ్రొక్కి
శర్వు చరణమూలంబునఁ - జల్లినారు. ౬౧

క॥ గిరి కొమరిత నల్లని ముం
గురుల నడుమ వెలుఁగుకొండ - గోఁగులుఁజెవులన్
జెరివిన చివుళులు ఉురల శం
కరు పాదము శిరము సోఁక - గాఁబ్రణమిల్లెన్. ౬౨

క॥ భవుఁడును ననన్య భాజం
బవు వరుఁడు లభించుఁ గాత - మని దీవించెన్;
అవును మహాత్ముల వాక్కులు
భువి నెన్నండేని పొల్లు - వోవునె తలఁపన్? ౬౩

క॥ శలభము గతి నగ్గింబడ
దలచిన యా చక్రినయ్యు - పార్వతి ప్రోలం
గల హరుపై గుఱిమిడికర
జలజంబున నదను చూచి - జ్వాలతఁ దడవెన్. ౬౪

తే॥గీ॥ అంత గౌరి తపస్వి యా - హరున కెలమి
నరుణకాంతికరంబునఁ - దరణికిరణ
ములను నెండిన మిన్నేటి - జలజ బీజ
మాలఁ గానుక పెట్టెను - లీలతోడ. ౬౫

తే॥గీ॥ హరుఁడు నద్రులకుం బ్రియుఁ - డగుట చేత
నింపు మీఱఁ దావళనుఁ బ్ర - హింపఁ దొడఁగె
బుష్పబాణుఁడమోఘ స - మ్మోహనాస్త్ర
మపుడ సంధించె నిక్షు బా - ణాసనమున. ౬౬

తే॥గీ॥ కొంత ధైర్యంబు చలియింపఁ - గువల యాప్తు
నుదయ మప్పటి జలధి నా - నొప్పి శివుఁడు
సాభిలాషంబు గాఁగ, బిం - బాధరోష్ఠి
మొగముపైఁ జూడ్కు లప్పుడు - పొలయఁ జేసె. ౬౭

తే॥గీ॥ ముగుద తనువు పైఁ బులకలు - మొలకలెత్త
వికచ బాల కదంబంబు - విధము దనరు
నంగముల భావ మేర్పడ - వడ్డముగను
బెదరు చూపుల మొగ మొది - వించియుండె. ౬౮

తే॥గీ॥ అంత నింద్రియ క్షోభంబు - నరసి యీశుఁ
డెట్టకేలకు దానిని - దిట్టపఱచి
యీ మనోవికారమునకు - హేతు వేది
యనుచు నల్దెసల్ దాఁ గల - యంగఁ జూచె. ౬౯

తే-గీ॥ వంచి యెడమకాల్ భుజములఁ - గుంచి వింటి
వలయముగఁజేసి కుడికంటి - కొలికియొద్దఁ
బిడికిలి గదించి బాణంబు - విడువ నుద్య
మించు నించు విల్కాని వీ - క్షించె నతఁడు. ౭౦

తే-గీ॥ నియమ భంగమానను కోప - నిర్భరమున
బొమలు ముడివెట్టి దుస్సహ - మూర్తియైన
యతని మూఁడవ నేత్రంబు - నంటు నుండి
ప్రజ్వలించుచు ననలంబు - బయలు వెడలె. ౭౧

తే-గీ॥ విడు విడుము కోపమంచును - వేల్పు మూఁక
యాకసంబున మొఱయిడు - నంతలోన
భవు తృతీయ నేత్రమునుండి - బయటఁబడిన
చిచ్చు మదనుని భస్మావ - శేషుఁజేసె. ౭౨

తే-గీ॥ దుస్సహంబైన దుఃఖ హే - తువుఁజేసి
యింద్రియములు స్తంభింపఁగా - నెసఁగు మూర్ఛ
భర్తృశోకము రతికిఁ గ - న్పడక చేసి
కొంతసే పుపకారి నాఁ - గొఱలెనపుడు. ౭౩

తే-గీ॥ విఘ్నకారకుండగు పచ్చ - విల్తు నపుడ
పిడుగు వృక్షంబునుంబోలె - జడలదారి
బూదిగావించి వనితల - పొత్తు వదలి
ప్రమథ గణములతోడ ది - చ్చు మొగమయ్యె. ౭౪

చ॥ తదుపరి నుచ్చిరన్కుఁడగు - తండ్రి యభీష్టము నాడెపుంబసం
బొదలిన స్వీయదేహమును - బూర్తిగ వ్యర్థములయ్యె నంచున
య్యదియు సఖీ సమక్షమున - నాటను మిక్కిలి లజ్జదోఁప నె
య్యెదియునుదోఁపకన్నగజ-యేగె గృహాభిముఖంబుగా వెసన్. ౭౫

ఉ॥ అప్పుడ దంతలగ్నమగు - నబ్జిని దేవగజంబు మోచునా
చొప్పున నద్రిరాడ్వరుఁడు - శూలి యమర్షభయంబునం గనుల్
చప్పున మోడ్చినట్టి సుత - జాలిఁగరంబులఁ గ్రుచ్చిరొత్తి పా
లొప్పుఁగఁజాచియంగముల-నుర్వడిమైఁజనెనింటి త్రోవనన్. ౭౬

# ప్రేమలేని సతీపతుల సాంగత్యము.

బి. సంజారెడ్డిగారు.

హే! పిల్లఁగ్రోవి! మారుతము నీయందుకృపఁజూపక పో యిన నిన్నాలకించువారెవ్వరు? నీకప్పుడు మృదుమధుర స్వరం బు ఎక్కడిది? వట్టి వెదురు కట్టయేగా! అట్లుగాక, మారుత మెల్లెడలను విరివిగా వీచుచు వీధి వీధులయందు విట్ట వీగుచుం డ, హేపిల్లఁగ్రోవి వెదుటికట్టవే! నీవులేకున్న, నీమధురగాన మున కామారుతముచేయునదైనను ఏమి? గట్టిగాలి యొక్క టియే గానంబుగావింపవీలగునా? అదియట్లుండ

పదములచే పంటపండించు పండితుని హృదయమున భావమే లేకున్న కవనమెట్లగును? కవనశక్తియే కవియందు కణ జమైయుండి పదములే పడకున్న, కణజమైన నేమి? బురదకా లువైన నేమి? వైణికుడు లేకున్న గృహమున వీణయుండియు అగుప్రయోజనమేమి? వీణయుండి, గృహమున వైణికుడునుండి, వీణయందు కమ్మీలు లేకున్న, లేక వైణికునకు నఖాగ్రమే లేకు న్న ప్రయోజనమేమి? ఇదంతయు నొకరికొకరు ప్రేమించని సతీపతుల సాంగత్యమునకు సాటియే సుమా!

---

## ఘోషా.

బి. కృష్ణప్పనాయనింవారు.

కూలినాలి చేసికొని కుటుంబమును పోషించుకొనవలసిన బీదకుటుంబ ములు సహితము ఘోషా పిశాచికిలోబడి గోచికి గంజికి కూడ జరుపుకొన లేక అవస్థలు పడుచున్నవి. మహమ్మదీయ యువతి యొకర్తు పబ్లిక్ రోడ్డు లో నిండుగా దుప్పటి కప్పుకొని బిర బిర ప్రయాణము చేయుచు దారితెలి

యక కాబోలు సైడ్ కాల్వలోపడి కాలువిరుగవలసినంతటి ప్రమేయము నను తటస్థమై యింటికి బోగా సామానము తీసితివే అని మగడుకొట్టెను. పాపమాయమ ప్రతిదినము ముసుగుతోనే పోయికూలిచేసి కూలిడబ్బుతో తన త్రాగుబోతు మగనిని, చిన్ని చిన్ని బిడ్డలను పోషించుచుండెను.

మహమ్మదీయులలోనే గాక తెనుగు వారలలోగూడ పాపము ఆడువాండ్రకు ఘోషా పద్ధతులు మిక్కిలి దుర్భరమై, వారలను పీల్చిపిప్పి చేయుచున్నవి మతములు. త్రాగుడు పిచ్చిలో ఒకశాఖ వంటిది యీఘోషా పిచ్చికూడ. ఘోషాలలో రెండు ముఖ్యమగురకములున్నవి. 1. పూర్తి ఘోషా 2. అర్ధఘోషా, ధనికులకు పూర్తిఘోషా, బీదలకు అర్ధఘోషా. ఈ ఘోషాలు అనాదిగా ఏర్పడినవనికొందరు విడువలేక మిణకరించుచున్నారు. కొందరు బీదలు చెఱబడ్డకోతులవలె తికమికలాడుచున్నారు. తెగించివిడిచి కొందరు అనారోగ్యము, అవివేకము, పోగొట్టుకొని ఆరోగ్యము, స్వాతంత్ర్యము, ప్రపంచజ్ఞానము కలిగి తమ భర్తలకు నిజముగా సహధర్మచారిణులగు చున్నారు.

బీదలకీ ఘోషాలు నెత్తిపై పాషాణములవంటివి. అయినను, ఒక విధమువారి సోమరి భర్తలకవి మేలుచేయుననుకొనుచున్నారు. ఎట్లు? ఇంటిలోని పోరు ఇంతింత కాదయా అన్నట్లు "అయమ్మ భర్త ఆయమ్మకు తెచ్చియిచ్చియుండు అభరణములు, చీరలు, రవికెలు, నాకు మీరు ఎందుకు తెచ్చియియ్యరు? నేనేమి పాపము చేసితిని? మీవంటి బీదకుటుంబములో మావారు తెచ్చిత్రోసిరే" అనెడి అవివేకపు భార్యలు గల సోమరి భర్తలకు, ఘోషాలు లేకుంటే విచ్చలవిడిగా ఇల్లిల్లు తిరుగవచ్చునే అనెడి అజ్ఞానపు స్త్రీల భర్తలకు, ఈఘోషాలుమంచి వేమో! అట్టివారు ఘోషాలో ఉండినా లేకుండినా ఫలితమొక్కటే. ఘోషాలో నుండియే అజ్ఞానపు యువతులు కొందరు అధర్మప్రసక్తులై, అనాచారముల కధ్యక్షత వహించుచున్నారు. ఘోషాఅనగా రాణివాసము. కృషితో జీవించుకొను బీద తరగతులకు ఘోషా పిశాచమువంటిది. పూర్వాచారమును వదలను సమ్మతిలేని మగవారలు, సోమరి తనములేక, కృషిసల్పి, వాటికి గుడ్డను కొదువలేక సంపాదించికొన్న సరే; లేకున్న ఘోషాను పూర్తిగావదలి ఆడువాండ్రతో గూడ కృషిచేసి సంపాదించి తమబీద కుటుంబములు పోషించుకొనుట మంచిదని నాయభిమతము.

# కర్షక స్థితి.

కె. మురుగేశముదలిగారు.

## (తగ్గు గడన)

సీ॥ చేలఁజదునుచేసి కాలమునకుదున్ని
పైరుపండించిన వడ్లమీఁద ।
వత్సరాంతముదాఁక వనరుచుఁగర్షకుల్
కూర్మితోఁజేసిన గుడముమీఁద ।
మానభంగములేక మానవకోటికి
వస్త్రముల్గలిగించు ప్రత్తిమీఁద ।
వరుణదేవునినమ్మి వావిరిగాఁజల్లు
మెరకధాన్యములకు సరకుమీఁద ।

గీ॥ ధరలుతగ్గె పాశ్చాత్యుల సరకులెన్న
వెలలధికమాయె ఋణమున వెతలఁబడుచు
దొరతనపుఁబన్ను చెల్లింపఁ ద్రోవలేక
యాస్తులను గోలుపోవంగ నైరిజనులు ॥

## హెచ్చు పన్ను.

సీ॥ ప్రదనములలోన సర్వదాజనులకు
నుపయుక్తమైనట్టి యుప్పుమీఁద
గంధకాదులఁబుట్టు మందులతోడను
పోడిమియగునిప్పు పుల్లమీఁద
కర్షకావళులనాకర్షణచేసెడి
యిలనుండితేఁబడు నినుముమీఁద
కాకలమల్పమా గాజుసామానులు
చమురు, చర్మము, సీమ, సరకుమీఁద ॥

గీ॥ ధరలు హెచ్చెను జనులది సరకుగొనక
మెలఁగుచుండిరి; గృహకార్యములనుసల్ప
నిప్పుడీదేశవస్తువు లిట్లు వెలలు
తగ్గ ఋణములపాలైరి ధనములేక ॥

# ఉపాధ్యాయుల దుస్థితి.

"ఛీదురదృష్టమ! కూటి కష్టమా!"

వావిల్తోట మునిరెడ్డిగారు.

ఉ॥ పంతులమూఁకఁ జేర్చితివి
 పట్టణవాసులనెల్ల దూర గ్రా ।
మాంతరవాస ముంచితివి
 మార్పులనుంచుచు నైకమత్యమా ।
సంతయులేక చేసితివి
 వారలలోపల వారికెక్కుడౌ ।
పంతములుంచి వైచితివి
 పట్టుగుప ల్కుబడుల్ త్యజించిధీ ।
మంతులఁ గుందఁజేసితివి
 మార్పునఁ బైయధికారులందఱన్ ।
వంతలపాలొనర్చితివి
 వారును ఛీయనిరోసి మార్పఁగా ।
నంతట నూరకుండకమ
 హాత్ములఁ గొందఱఁ బట్టుజేసి నీ ।
వంతయు రద్దుచేసితివి
 వాంఛవహించుచుఁ గొందఱన్ సదా ।
స్వంత పురంబులోనిడితి
 వప్రియముంచుచుఁ గొందఱిన్ యథా ।
ప్రాంతము లేక చేసితివి
 రంజనమించుక లేక చేసి; షేం ।
లంతయుఁ బాడు చేసితివి
 లాక్షణికోత్తమ బోధకాళులన్ ।
జింకలపాలుచేసితివి
 ఛీ దురదృష్టమ! కూటి కష్టమా? ॥

# మారటోరియము.

అభిప్రాయభేదములు మానవస్వభావ జన్యములు. భేదప్రవృత్తిలేక మానవ ప్రకృతియేలేదు. భిన్నభావములు ఉదయించిననేగాని పురోభివృద్ధి దుస్సాధ్యము. గమ్యస్థానమొకటియై భిన్నమార్గములు సంప్రాప్తించినను సాఫల్యముగలుగునుగాని లక్ష్యభేదముండి మార్గభిన్నత్వముకూడ దానికి తోడగుచో ప్రయోజనము సిద్ధించనేరదు. 23 వ సెప్టెంబరు తేదీన వెలువడిన గెజటులో ప్రకటింపబడిన మారటోరియము బిల్లునుగూర్చి అనంతములైన అభిప్రాయములు ప్రకటింపబడినవి. ప్రజాభిప్రాయమును సరిగా తెలిసికొనుటకే ప్రభుత్వమువారు బిల్లును ప్రకటించిరి. ప్రజలకు తమ అభిప్రాయములను వ్యక్తపఱచు హక్కుగలదు. కాని అట్టిహక్కును దుర్వినియోగము చేయరాదు. ప్రభుత్వ విధానమను లోహమును ప్రజాభిప్రాయమను మూసలోపోసి కరగించిననేగాని మాలిన్యముపోయి పరిశుద్ధత్వము సంప్రాప్తించదు. విమర్శనము సక్రమముగా నుండవలెను. స్వార్థమును పురస్కరించుకొని యుండరాదు. ప్రజాక్షేమమునే గమనించవలెను. స్వప్రయోజన ప్రధానముగా నుండరాదు అట్టి విమర్శనమును గ్రహించి తదనుకూలములైన మార్పులను తమ విధానములో చేసికొనుట ప్రభుత్వము వారి విధియైయున్నది

ప్రజావిమర్శనమును పరీక్షించుటకు ముందు బిల్లులోని అంశముల గ్రహించవలసియున్నది. బిల్లుయొక్క ఉద్దేశము సరిగా గ్రహింపకపోవుట వలన కొన్ని విమర్శనములు బయలుదేరినవి మారటోరియము అనగా ఆలస్యము చేయునది యని వ్యుత్పత్త్యర్థము. అనగా హక్కులను భంగపరుపక అమలు జరుపుటలో ఆలస్యము చేయుటయే మారటోరియము యొక్క ప్రధానలక్షణము. హక్కును తొలగించుటకును, హక్కును అమలు జరుపుటలో కాలయాపన చేయుటకును చాల తారతమ్యము కలదు. కొన్ని స్థలములయందు కాలయాపనమువలన హక్కు ఉన్నను నిష్ప్రయోజనమగుట అనుభవవేద్యమేగాని అందువలన రెంటికిని భేదములేదనుట కేవలము పొరపాటు. ఆలస్యమువలన హక్కులు నిష్ప్రయోజనములగు స్థలములందు అట్టిబాధలను తొలగించునటులగాని లేక చాలమట్టుకు తగ్గించునటులగాని చేసినచో కష్టములేదు. ఈ ముఖ్య సూత్రము ననుసరించియే

'మద్రాసు రాష్ట్రములోని ఋణగ్రస్తులైన వ్యవసాయకులకు తాత్కాలికముగా బాధను నివారించుటకై ఏర్పడినబిల్లు' అని ఆరంభమున నిర్వచింపబడియున్నది. ఈ ప్రధాన విషయమును గమనించినచో మనము చూచుచున్న విమర్శన బాహుళ్యము కలుగకుండెడిది.

1930 సంవత్సరమునుండి ప్రపంచమున ఆర్థిక దారిద్ర్య మహాపిశాచము తాండవించుటయు అందులో పరిశ్రమలకంటె వ్యవసాయమునకు, వ్యవసాయకులకు ఎక్కువ నష్టము సంభవించుటయు, తయారైన సరకులకంటె ముడివస్తువులకు అందులో ధాన్యాదులకు ధరలు విశేషముగా మందగించుటయు, సర్వులకు తెలిసిన విషయమేగాక ఆర్థిక శాస్త్రపండితులందరు నంగీకరించియున్నారు. ధాన్యాదుల ధరలు నూటికి 50 కంటె ఎక్కువగా పడిపోయినను వ్యవసాయకుని ఖర్చులు ఎంతమాత్రము తగ్గలేదు. పైగా పన్నులు వగైరాలు కొన్నిచోట్ల హెచ్చుఅయినవి. వస్తువుల ధరలు పడిపోయినప్పుడు డబ్బులో లెక్కించినచో ఖర్చులో మార్పు కనబడకపోయినను, వ్యవసాయకునిమీద భారము మాత్రము వృద్ధియగును. ఇది సులభముగా అనుభవములోనికివచ్చు విషయముగాదు. రోజుకు మనుజునికి 0-4-0 కూలిరేటు ఉన్నదనుకొందము. ధరలు సగము పడిపోయినప్పుడు ధాన్యములో లెక్కచూచినచో అదేపావులాకు రెట్టింపుధాన్యము ఖర్చు అగుచున్నది. ఒక పుట్టిధాన్యము 80-0-0 అమ్మినప్పుడు, శిస్తుక్రింద రుప్య 10-0-0 న్ను వ్యవసాయము ఖర్చులక్రింద రుప్య 20-0-0 మరమ్మతు వగైరా క్రింద 10-0-0 అయినచో రయితునకు మిగులు నికరాదాయము రుప్య 40-0-0 ఉండును అదేపుట్టి 40-0-0 అగుచో నికరాదాయము అందులో సగమైన రుప్య 20-0-0 ఉండదు. ఏలననగా కూలిలోను పన్నులు వగైరాలోను తగ్గింపులేకున్నచో పూర్వమువలెనే పదిరూపాయలు శిస్తుక్రిందను యిరవై రూపాయలు వ్యవసాయపు కూలిక్రిందను పదిరూపాయలు మరమ్మతు క్రిందను పోయినచో రయితునకు మిగులనదేదియులేదు. లోతుకుదిగి విచారించినయెడల ఈ విషయ మందరికి తెలియునుగాని సులభముగా స్ఫురణకు రాదు. ఇట్టి దుస్థితి వ్యవసాయకులకు నేటివరకు గలదు. ఇప్పటి ధరలలో ఎంతవిస్తారమైన భూమియున్నను వ్యవసాయకునికి మిగులు నికరాదాయము పూజ్యమో లేక బహుస్వల్పమో అనువిషయము అనుభవముగల ప్రతివారికిని గోచరమగును ఇట్టి వ్యవసాయకులు అనగా వ్యవసాయమే జీవనముగాగలవారు నూటికి 80 మంది మనదేశములోగలరు. వారియొక్క బాధ నివా

రించుట ప్రభుత్వముయొక్క ముఖ్య ధర్మమనుటలో ఎట్టి సంశయమును లేదు. వ్యవసాయకులకుగల అన్ని బాధలలో ప్రస్తుతము బహుతీవ్రము గా నున్నది ఋణబాధ. ఈ బాధను శాంతిచేసిననేగాని వ్యవసాయకునిస్థితి దుర్భరమగును. ఈఋణమునకు కారణము రయితుయొక్క అజాగత్రయు, మితిలేక వ్యయముచేయుట, వివాహాదులకు వ్యయించుట మొదలగు పనులు అని కొందరి అభిప్రాయము. అది కేవలము పొరపాటు. వ్యవసాయకుని ఋణమునుగూర్చి దివ్యమైన రిపోర్టును వ్రాసిన సత్యనాథంగారు రయితు ఋణములో నూటికి 50 వంతులు ప్రాత అప్పు అనియు వివాహాదులకు అగు ఖర్చు 13 వంతులుమాత్రమే అనియువ్రాసినారు. కావున రయితుయొక్క అమితవ్యయమువలనకల్గిన ఋణము విశేషముగాలేదని తేలుచున్నది.

ఈ ఋణసమస్య ఎట్లు పరిష్కారమగును? పరిష్కారమగుచో తిరిగి రయితులు ఋణములో పడరా అను ప్రశ్నలు కలుగుచున్నవి. శరీరమునకు జబ్బుచేసినచో జబ్బునయమగునా, తిరిగి జబ్బురాదా యని ఎవరైనను ప్రశ్నింతురా? అటులనే రాజకీయదేహమునకు కలిగిన రుగ్మతకు తగుచికిత్స చేయవలసినట్టియు, చేయగలిగినట్టియు వైద్యుడు ప్రభుత్వమే. చికిత్స చేయవలసిన మాటనిజమే కాని చికిత్స చేయుటెట్లు అనునది పెద్దసమస్య. మిక్కిలి నీరసస్థితిలో వచ్చినరోగిని తగురీతిని పరీక్షించక వైద్యుడు శస్త్రము చేయునా? రోగియొక్కమూత్రము హృదయము నాడి మొదలగు అష్టస్థానములను పరీక్షించి నీరసస్థితి ఎక్కువగా ఉన్నచో కొద్దిరోజులు బలము కలుగుటకు ఔషధమునిచ్చి భిషగ్వరుడు శస్త్ర చికిత్స చేయునటుల ఈ సమస్య పరీక్షించి రయితుల నిస్సారమును తగ్గించి, ఋణరోగముయొక్క ఉద్రేకమును అడ్డగించుటకు కొలది అవకాశము కావలసియున్నది. అట్టి అవకాశమే మారటోరియము.

మన అనుభవమునుబట్టి చూచినచో వడ్డీ రేట్లు హెచ్చుగానున్నవి. వడ్డీయనగా డబ్బువాడుకున్నందుకు ఛార్జి అనియర్థము. ఉత్పత్తికి కావలసినవి మూడు పదార్థములు. భూమి, కూలి, పెట్టుబడి. పెట్టుబడికొఱకు సాహుకారు నొద్దకు వెళ్ళి ఋణముతీసికొనవలసియున్నది. వస్తూత్పత్తివలన ఉత్పత్తిదారునకు వచ్చులాభము పెట్టుబడి మీది వడ్డీకంటె ఎక్కువగా నున్ననేగాని ఉత్పత్తిదారునకు లాభములేదు. వ్యవసాయమునకు తీసికొని వచ్చే పెట్టుబడిమీది వడ్డీకంటె వ్యవసాయముమీది లాభము ఎన్నడును ధరలు హెచ్చుగానున్నప్పుడు కూడ తక్కువగానేయున్నదని తేలికగా

బుజువు చేయవచ్చును. అట్టిస్థితిలో వడ్డీనలన దేశమునకు ప్రయోజనమేమి? అనగా వడ్డీ అవసరములేదని అభిప్రాయముగాదు. వడ్డీ తప్పక అవసరమే. రేటు మాత్రము దేశక్షేమములకు అనుకూలముగా నుండవలెననునది ముఖ్య సూత్రము.

ఇదివరకున్న బాకీలకువడ్డీ ఏరీతిని కట్టినచో ఋణదాతలకు ఋణగ్రస్థులకు న్యాయముగానుండును. ఋణదాతలయొక్క బాకీలను సర్దుబాటుచేయుటకు ఎట్టి శాసనములు కావలెను అనునవికూడ ముఖ్యవిషయములు. ఋణదాతలకు డబ్బుతోనే బాకీలను సర్దుబాటు చేసేయెడల ఆ డబ్బును ఋణగ్రస్తులకు సప్లయిచేయుమార్గములెవ్వి? అనుసమస్య ప్రభుత్వము నెదుర్కొను చున్నదియు వీనికి పరిష్కారమెట్లు అను విషయమును ఆలోచించి సాధ్యమైనంతవరకు దేశములో ఆర్థిక శాంతి కలుగునట్లు చేయుటకు మార్గాన్వేషణమునకు మాత్రమే మారటోరియము బిల్లు ఉద్దేశింపబడినది. పైసమస్యలకు పరిష్కారము వెంటనే కుదురునెడల మారటోరియమే అవసరములేదు. కాని సమస్యా పరిష్కారము అనుకొన్నంత సులభముకాదు. వడ్డీరేటు విషయమై ఋణపరిష్కార విషయమై శాసనములకు విశేషకాలము అవసరము లేకున్నను పరిష్కరింపబడిన ఋణములు డబ్బులో ఇవ్వవలసినవానికి డబ్బు సప్లయిచేసే మార్గము బహుక్లిష్టమైనది. దానికి కొంతకాలము కావలసి యున్నది. అందులకే మారటోరియము. సుమారు ఒక సంవత్సరములోపల పని పూర్తియగునని ప్రభుత్వమువారి నమ్మకము. కాకున్నను రెండు సంవత్సరములలో నైనను తప్పక పరిష్కారము కాగలదు. రెండు సంవత్సరముల వరకు దీనిని పొడిగించే అధికారము మంత్రివర్గమునకు కలిగియుండునట్టుల బిల్లులో ఉద్దేశింపబడినది

ఒక సంవత్సరమునకు ముందే యీ విషయములన్నియు పరిష్కారమగుచో ఈ బిల్లును ఈ లోపుగాకూడ విరమింపజేయుటకు మంత్రివర్గమునకు అధికారమొసంగబడినది. మంత్రివర్గమువారు సాధ్యమైనంత త్వరలోనే కావలసిన మార్గముల నన్వేషింపగలరు.

ఈ మారటోరియము శాసనము అమలులోనికి వచ్చిన తరువాత బాకీలను గూర్చిన దావాలు వేయుటకు వీలులేదు. డిక్రీలు అమలు జరుపుటకు వీలులేదు. ఇన్సాల్వెన్సీ పిటీషనులు ఋణ పరిష్కారపు పిటీషనులు అన్నియూ ఎక్కడివి అక్కడ ఆగిపోవును. అయితే వ్యవసాయకులు ప్రతివాదులు అయినప్పుడే యిది అన్వయించును

బ్యాంకులు, పరపతిసంస్థలు, ప్రభుత్వము రుణదాతలు అయినప్పుడును, 1346 ఫసలీ లగాయతు భూస్వాములకు యివ్వవలసిన కట్టుబడి శిస్తులు యివ్వవలసినప్పుడును ఈ బిల్లు వర్తింపదు. తనఖా బాకీలకు కూడా యీ బిల్లు వర్తించును. లోగడ ప్రకటింపబడిన బిల్లునందు వ్యవసాయకులకు కొందరికి ఈ బిల్లు వర్తింపదని చెప్పబడియున్నది. 1346 ఫసలీలో గవర్నమెంటుకుగాని జమీందారుకుగాని, భూస్వాములకుగాని శిస్తులు వగైరా 400-0-0 యిచ్చియున్న వ్యవసాయకులమీద దావా వగైరాలకు అభ్యంతరములేదు. 400 పైగా శిస్తు యిచ్చువారు కొంత ఆస్తి కలిగియుందురనియు వారికి రుణబాధయున్నను సర్దుబాటుచేసికొనుటకు వారికి కొన్ని అవకాశములు కలవనియు, వారికి కూడా సహాయము చేయుట అవసరమేయైనను ప్రభుత్వము ఆర్థికములకు కొంతనష్టము వచ్చుననియును, అభిప్రాయపడి ప్రభుత్వమువారు ఈ విభాగమును చేసిరి. తమకు ఉన్న ఆస్తులలో ఎక్కువభాగము వ్యవసాయకులవల్ల రావలసిన రుణములైయుండి యీ బిల్లు వలన బాధకలుగుచో, వారు లోకులకు యివ్వవలసిన బాకీలకు కూడా మారటోరియము వర్తించును. తనకువచ్చు ఆదాయములో మూడు వంతులు భూమిమీద వచ్చుచో అట్టి ప్రతివాడును వ్యవసాయకుడుగా పరిగణింపబడును.

రుణదాతలకు నష్టములేకుండుటకుగాను ఎంతకాలము వరకు దావా వగైరాలు వేయుటకు ప్రతిబంధకముగలదో అంతకాలము లిమిటేషనులేదు. రుణగ్రస్తులు అనవసరముగా తమ ఆస్తిని అన్యాక్రాంతములు చేసినచో అట్టివి చెల్లనేరవు. ఈ చట్టముక్రింద అవసరమగు విషయముల నిర్ణయించుకొరకు ఒక ప్రత్యేకాధికారివర్గము ఏర్పాటు చేయబడును. ఈ చెప్పినవే బిల్లులోని ముఖ్యాంశములు.

ఈ బిల్లు యింకా అములులోనికి రాకపోయినను దీని సూత్రముల గమనించు బాధ్యత రుణదాతలకును, రుణగ్రస్తులకునుగలదు. రుణగ్రస్తుల నెటులైనను బాధలనుండి నివారించుట అవసరమను భావము రుణదాతలకు ఉండవలెను. రుణదాతలకు తమశక్తికి సాధ్యమైనటుల రుణముల తీర్చుకొనవలెనను బాధ్యతను రుణగ్రస్తులు గుర్తించవలెను. తొందరపడి కోర్టులకు పోయి ఈ లోపుగా రుణగ్రస్తుల ఆస్తులను వేలం వేయించి వారిని యిబ్బంది పెట్టుట రుణదాతల విధిగాదు. అనవసరముగా అప్పులను పెంచుటగాని ఆస్తుల అన్యాక్రాంతము చేయుటగాని దోషమని రుణస్థులు గ్రహించ

వలెను. ఈ విధుల నతిక్రమించిన ఉభయకక్షులవారును ఋణపరిష్కారము నందు నష్టపడుదురు. ధర్మముగా ప్రవర్తించినవారికే రాబోవు శాసనముల యందు మేలుకలుగును. మారటోరియము బిల్లువలన బాకీలన్నియు పోయి నవి, ఎగరవేయవచ్చునని ఋణస్థులనుకొనుటకు వీలులేదు. మన ఆస్తులన్నియు పోయినవి అని ఋణదాతలు భయపడవలసిన పనిలేదు. బాకీలు ఎక్కడికి పోలేదు. బ్రతికియేఉన్నవి. అవి యికముందు న్యాయముగ పరిష్కరింప బడును. అందుల కనువైన శాసనములు ముందురాబోవుచున్నవి. ఋణదాత లు ఋణస్థులుగూడ ఒకరినిమించి యొకరు రెండవవారిని మోసగించుటకు వీలులేదు. అట్లన్నచో అందరు మోసగాండ్రని ఆ వాక్యము తాత్పర్యము గాదు. క్వచిత్తుగా అట్టివారున్నచో వారందులకగు ఫలమనుభవింతురు ఇదియు మారటోరియం బిల్లుయొక్క అంతరార్థము, రహస్యము.

# ప్రాథమిక విద్య ఎట్లుండవలెను?



MAHATMA GANDHI

## గాంధి మహాత్ముడు.

[కడచిన అక్టోబరు 22, 23 తేదీలలో వార్ధానగరమునందు మహాత్ముని అధ్యక్షతను విద్యాసభ జరుగుటయు, కాంగ్రెసురాష్ట్రవిద్యామంత్రులాదిగా పెక్కు విద్యాభిమానులు సభకు విచ్చేసి చర్చలలో పాల్గొనుటయు, మహాత్ముడు సూచించిన వృత్తివిద్యా పూర్వకమైన ప్రాథమిక విద్యాపద్ధతిని సభవారామోదించి, అందులకు తగిన ప్రణాలికను సిద్ధము చేయుటకు డాక్టరు జాకిరు హుస్సేనుగారి అధిపత్యమున నొక కమిటీని నియమించుటయు చదువరులెరుగుదురు. మహాత్ముడాసభలో నీ క్రింది విధముగా తన సూచనలను స్పష్టీకరించెను.]

ప్రస్తుత విద్యావిధానము దేశమునకేమాత్రము ఉపయోగకరముగ నుండుటలేదు. ఉన్నత తరగతులలో సకలవిషయములు ఇంగ్లీషుద్వారా బోధింపబడుచుండుటవలన, స్వల్పసంఖ్యాకులైన విద్యాధికులకు, బహుళసంఖ్యాకులైన జనసామాన్యమునకును మధ్య పెద్ద అఖాత మేర్పడిపోయినది. జనసామాన్యములో విద్య వ్యాపించకుండుటకిది ప్రతిబంధకమయ్యెను. ఆంగ్లమున కీవిధమైన విశేషప్రాముఖ్య మీయబడుటవలన విద్యాధికులు జీవితాధ్వమునందు పంగుప్రాయులైపోయి, తమ దేశమునకు తామే దూరస్థులైరి. వృత్తివిద్యాశిక్షణమేమియు లేకపోవుటవలన ఫలదాయకముగు ఏకృషిని చేయలేక, శారీరకముగాకూడ బలహీనులగుట తటస్థించినది.

... ... ...

ప్రాథమికవిద్యకై ప్రస్తుతము కర్చుపెట్టబడుచున్న సొమ్ము కేవలము వ్యర్థమని చెప్పకతప్పదు. నేర్పినదైనను ఇటు జనపదజీవనమునకుగాని అటు నగరజీవనమునకుగాని పనికిరాదు. ప్రస్తుత విద్యావిధానమువలన నేదైన ఫలితముండిన, అయ్యది, ఎవరిచ్చు పన్నులవలన ప్రభుత్వకోశము ఎక్కువగ నిండుచున్నదో అట్టివారి కెంతమాత్రము ముట్టుటలేదు. ఏలన, వారిసంతాన మీ విద్యాప్రయోజన మేమాత్రము పొందుటలేదనియే చెప్పదగును.

... ... ...

ప్రాథమిక విద్యాసంస్కరణను ఈ క్రిందివిధముగా చేయవలెనని నాకు తోచుచున్నది. ఈవిద్య ఏడుసంవత్సరములలో పూర్తియగునదిగ నుండవలెను. ఇంగ్లీషును మినహాయించిన మెట్రికుృలేషను విజ్ఞాన మీఏడు సంవత్సరములలోను బాలురకేర్పడునట్లుగ నుండవలెను. పైగా, జీవనమున కాధారముగల్పించు ఏదైన వృత్తి విద్యయందు విద్యార్థి కుశలియైయుండు నట్లు చేయవలెను.

... ... ...

బాలబాలికల సర్వతోముఖాభివృద్ధికిగాను, వారికిచ్చు శిక్షణయంతయు సాధ్యమైనంతవరకు ఏదైన లాభదాయకమగు వృత్తి విద్యాబోధద్వారానే ఇవ్వవలెను. అనగా, ఈపద్ధతిద్వారా రెండుకార్యములు సాధింపబడవలసియున్నది. (1) వృత్తివిద్యచే ఆయావస్తువులు తయారుచేసి తద్ద్వారా విద్యార్థి తన శిక్షణకగు కర్చును తానే భరించుకొనగల్గుట. (2) ఆ వృత్తి విద్యద్వారానే విద్యార్థి శారీరక, మానసిక, ఆధ్యాత్మికోన్నతిని పొందగల్గుట. విద్యార్థులు తయారుచేసిన వస్తువుల అమ్మకముద్వారా, పాఠశాలకుగావలసిన నివేశనస్థలము, భవనము, సామగ్రి—ఇవన్నియుకూడ సంపాదింపబడవలెనని కాదు నా యభిప్రాయము. ఆకర్చులిందులో చేరవు.

... ... ...

ప్రత్తి, ఉన్ని, పట్టు పరిశ్రమలు (వడుకుపని, నేతపని, కలంకారిపని మొదలగునవన్నియు ఇందులో చేరును), కుట్టుపని, బైండింగుపని, ఆట వస్తువుల తయారుచేయుపని, బెల్లపువంటపని ఇవన్నియు సులభముగా నేర్చుకొనదగినవి. ఎక్కువ పెట్టుబడి అవసరము లేకయే సాగింపదగినవి.

... ... ...

వృత్తిని నేర్పుటద్వారా విద్యాబోధ చేయుపద్ధతియందు నాకుకొంత అనుభవమున్నది. దక్షిణాఫ్రికాలో టాల్‌స్టాయి ఫారమునందు నా కుమారులకును ఇతరులకును నేను మొదటకాలెన్ బాచిగారి వద్ద నేర్చుకొనిన వడ్రంగము, చెప్పులుకుట్టుపని మున్నగు వాని నేర్పుచు తద్వారా వారికి విద్యాబోధ చేసెడివాడను. ఇందువలన వారు చెడిపోయినదేమియు లేదని నేను గట్టిగా చెప్పగలను. కాని, నాకుతీరిక చాలతక్కువగనుండిన కారణమ్మునను, అనేకమైన ఇతర కార్యములయందు దృష్టి నిగుడ్పవలసినవాడ నగుటచేతను ఆచేసిన విద్యాబోధ నాకుగాని వారికికాని తృప్తికరముగా లేకపోయినది.

.. ... ..

కేవలము వృత్తులు నేర్చుకొనుటేకాదు—వృత్తులు నేర్చుకొనుట ద్వారా విజ్ఞానమును బడయుట—ఇది నా ఆశయము. సమస్తమైన విజ్ఞానము—సారస్వతము, దేశచరిత్ర, భూగోళము, గణితశాస్త్రము, భౌతికశాస్త్రము మొదలగు వన్నియు వృత్తి విద్యలద్వారానే నేర్పబడవలయును. మధ్యయుగములో ఇదేకదా విద్యాపద్ధతియని కొందరాక్షేపింపవచ్చును. కాదు. అప్పుడు వృత్తివిద్యాశిక్షణము ప్రధానముగ నున్నను, తద్వారా సకల విజ్ఞానమును బోధించు పద్ధతిలేదు.

... ... ...

తకిలీమీద నూలువడుకు పనిని నేర్పవలసియున్న దనుకొనుడు. ప్రత్తిలో ఎన్నెన్నిరకము లున్నవో, ఏయేరాష్ట్రములయందు ఏయే నేలలో ఏయేరకములు పండునో, వడుకుపరిశ్రమ మన దేశములో ఏవిధముగా క్షీణగతికి వచ్చినదో—ఈ సందర్భమున ఇండియాలో బ్రిటిషు పరిపాలన యొక్క చరిత్రకూడ వచ్చును—అసుపోయుట వగైరాలలో లెక్కలెట్లుండవలెనో ఎందుకుండవలెనో-ఇవన్నియు బాలురకు బోధింపవలసియుండును. నా మనుమని కిప్పుడు ఈవిధమైన శిక్షణ నిచ్చుచున్నాను శిక్షణపొందుచున్నట్లు వానికి తెలియదు. ఆడుచు, పాడుచు, గంతులువేయుచునే ఈవిషయముల నన్నింటి నేర్చుకొనుచున్నాడు.

... ... ...

విద్యార్థులు చేసిన చేతిపనుల మూలమున ఉపాధ్యాయుని కగు కర్చును రాబట్టవలెనని నాకోరిక. ఏలన, కోట్లకొలదిగనున్న మన బాలురకు విద్య నేర్పుట కింతకంటె వేరుమార్గములేదు. హైస్కూలు మిలిటరీఖర్చు

తగ్గించువరకును ఇతరత్రా మన కధికారాదాయము వచ్చువరకును మనము వేచి యుండజాలము. నేను సూచించిన ప్రాథమిక విద్యావిధానములో, గ్రామ పారిశుద్ధ్య మెట్లుండవలెను, ఏది పుష్టికరమైన ఆహారమగును, ఇతరులపై ఆధారపడక తనకు తాను కృషిసల్పుట యెట్లు, గృహములో తల్లిదండ్రులకు వారి వారి పనులలో తోడ్పడుటయెట్లు, మొదలగు నవన్నియు వచ్చును. ఇప్పటి పిల్లవాండ్రయందు శుభ్రత, స్వయంసహాయము, దేహదార్ఢ్యము మృగ్యములు. చిన్న చిన్న నాట్యవిధానముల ద్వారా బాలురకు శరీరవ్యాయామ శిక్షణ మొసగవచ్చును.

... ... ...

సాహిత్యవిద్యాభ్యసనమునకు నేను ప్రతికూలుడనని కొంద రపోహ పడుచున్నారు. అది యెంతమాత్రము నిజముకాదు. ఆ సాహిత్యవిద్య ఏరీతిగా అభ్యసింపవలెనో మాత్రమే నేను చెప్పితిని. పిల్లలను కష్ట పెట్టి వారిచేత పనులుచేయించుట అధర్మము కాదాయని కొందరనిరి. పిల్లల చేపనులు చేయించుటవలన సొమ్ము కొల్లగ వచ్చుననికూడ అధిక్షేపించిరి. ఈమాట సత్యముకాదని అనుభవమున్నవారికి తెలియును. తక్లీవంటి క్రీడా వస్తువులతో పిల్లలచే పనిచేయించుట వారిని కష్టపెట్టుటయగునా? ఇండ్లలో పిల్లలు తమ తల్లిదండ్రులకు వారివారి పనులయందు తోడ్పడుచుండుటలేదా? నేను చెప్పిన విధానమునందు, పిల్లవాడు తన తల్లిదండ్రులకే కాక, గ్రామమునెడ దేశమునెడ తనకుగల బాధ్యతను గుర్తెరుగుట నేర్చుకొనగలడు

... ... ...

ఈ నూతన విధానము హిందువులకు, మహమ్మదీయులకు, పార్సీలకు, క్రైస్తవులకు—అందరకు సమానము. మతమునుగూర్చిన బోధవిషయమై నే నెక్కువగా మాట్లాడలేదేమని కొందరనిరి. తనకు తాను సహాయపడ నేర్చుకొనవలెనని మతము—ఆచరణరూపకమైన మతము—ఈ విధానములో బోధింపబడుచునే యున్నది గదా !

... ... ...

బాలురు తయారుచేసిన వస్తువులను సరియైనధరలకు కొనియు, వారి శిక్షణ పూర్తియైన తర్వాత వారికి పనులు చూపించియు వారికి ప్రభుత్వము సర్వవిధముల తోడ్పడవలసిన విధి కలదు.

... ... ...

ఈ విద్యావిధాన నిర్వహణమునకై అధ్యాపకులను సంపాదించుటకు ప్రొఫెసరు కె. టి. షాగారు నిర్బంధసేవా విధానమును సూచించిరి. ఇది బానిసతనము క్రిందకు చేరదాయని కొందరి యధిక్షేపము. కాని, యువకులు జీవిత రంగములో ప్రవేశించుటకు ముందు ఏడాదో రెండేండ్లో నిర్బంధముగా దేశసేవయొనర్చుట బానిసతనముగా భావింప తగదు. కడచిన 17 ఏండ్లనుండియు యువకు లనేకులు అనేక విధములుగా త్యాగము చూపిరి. ఈ విధమైన దేశసేవ వారు సంతోష పూర్వకముగ చేయుదురని యే నానమ్మకము.

... ... ...

మనలో సాంఘిక కలహములు కలవు. ఇవి కేవలము మన మొగముననే వ్రాసిపెట్టినవికావు. వెనుక ఇంగ్లండులో కూడ అంతఃకలహములు చెలరేగెను. ఇప్పుడు ఇంపీరియలిజము లోకమునకు శత్రువై కూర్చున్నది. మనము సాంఘిక కలహములను రూపుమాప వలెనన్న, నేను చెప్పిన విద్యా పద్ధతిద్వారా మనపిల్లలకు బోధచేయించి, రాబోవు తరమునకు మంచిపునాది వేయవలసియున్నది. అహింసాత్మకమైన పద్ధతి యిది రివిన్యూనష్టమేమియు లేక, ప్రభుత్వకోశములు పూర్తిగా నిండియున్నను గూడ, ఈస్వయంపోషక విద్యాపద్ధతియే అవలంబించతగినది. మన సభ్యతకు, మననాగరికతకు, మనజాతియొక్క నిజమైన ధర్మము మన బాలురను ప్రతినిధులనుగా నొనర్పవలసియున్నది. యూరపు మనకు ఆదర్శము కాదు. దాని పద్ధతులన్నియు హింసాత్మకములు. రష్యా పెక్కు ఘనకార్యములు సాధించిన మాట వాస్తవమేకాని, దాని విధానమంతయు కేవలము హింస, దౌర్జన్యము మీదనే ఆధారపడియున్నది. మన భారతదేశము హింసను వర్జింపవలసియున్న యెడల, నేను చెప్పిన విద్యాపద్ధతియొక్క నియమము అనుష్ఠింపబడవలెను. విద్యకొఱకు ఇంగ్లండు కోట్లు కర్చుపెట్టుచున్నదని, అమెరికా కూడ అట్లే వ్యయపరచు చున్నదని చెప్పుదురుగాని, ఆ ధనమంతయు ఒకరిని కొట్టి సంపాదించినదని మరచిపోగూడదు. పరపీడనమునకు వారొక శాస్త్రమును తయారుచేసిరి. ఆకారణమున వారి బాలుర విద్యకు వారు కోట్లకొలది కర్చుపెట్టగల్గుచున్నారు. పరపీడనపద్ధతి మనకు అగ్రాహ్యము. కావున, అహింసాత్మకమైన ఈ స్వయంపోషక విద్యాపద్ధతి తప్ప మనకు స్వీకరింపతగినది మరియొకటి లేదు.

---




# పాపిచావు.

టి. ఆర్మోగం.

"ఓ, పాపులారా, పరలోకపు తండ్రి చెప్పిన దేమనగా 'ఓ గొర్రె పిల్లలారా, నాడగ్గర రండు. మీకు పరలోకమునకు త్రోవ చూపించెదను.' అని. మీరు ఆ దేవుని లోకమునకు పోవలెనన్నచో నరకములోనుండి తప్పిపోవలెననినచో మా దేవుడైన యేసుక్రీస్తును నమ్ముడు. ఆయన పరలోకపు తండ్రికొడుకు. ఆయన మిమ్ము తన తండ్రికి సిఫార్సుచేయును మీకు నరకము, పాపము తప్పిపోవును."

అని యింక నేమో ఉపన్యాసము చేయసాగినాడు. వినువారందరు గమనించుచున్నారా లేదా అను సందేహమున నా ఫాదిరి చుట్టుకలయ జూచెను. ఒకచోట నొక యేనాది ముగుద పైట తొలగించి బిడ్డకప్పుడే చన్నందిచ్చెను. ఆ దృశ్యము తనమనస్సున గాఢముగ హత్తుకొనిపోయెను!

ఆ ఫాదిరి ఇంగ్లాండులో పుట్టిపెరిగి మిషనరీగా ప్రపంచమంతయు పర్యటనము చేసినాడు. అనేక భాషలు నేర్చినాడు. నానాదేశ నగరజన పదములలో నుపన్యాసములిచ్చి యచ్చటచ్చటి జనులతో కలిసి మెలసి యుండువాడు. వివిధ నారీజన సాహచర్యము లభించినను భీష్మించి బ్రహ్మచర్యమును గాపాడుకొనినవాడు. అప్పుడప్పుడు కోతిబుద్ధి తప్పుడు త్రోవలకు లాగదీయుచుండినను అసాధారణ ప్రతిభా సంకల్పమున మనసును చిక్కబట్టుకొని అట్టివానికి పెడమొగము బెట్టుచుండును.

ఆ పాలిండ్ల యందదుకు కొనిపోయిన దృక్కుల నటునుండి చీల్చికొని ప్రేక్షకుల మొగముల నొండొండ పరిశీలించెను. ఈ యేనాది గుంపంతయు వేర్వేఱుగ - ఒక్కొక్కరుగ - తన్ను సమీపించినగాని యేసుక్రీస్తు పవిత్ర ప్రేమ నెఱుంగజాలదని తీరుమానించికొనెను.

"పాపకూపమునబడి విలవిల దన్నుకొని చావవలయునని నిశ్చయించికొని యుండినవారు నాకడకు రాకుడు కాని, దేవుని బిడ్డలారా, మా తెల్లదొరగల దేవునిదగ్గరకు పోయి మీజన్మలను పవిత్ర మొనరించుకొనుటకు వలచితిరేని నాగుడిసెకడ కొక్కొక్కరుగ రండు. సూక్ష్మములో మోక్ష మార్గము చూపెదను. మందులను మూలికలను ఇచ్చెదను" అనెను.

తాను నిలిచి యుపన్యసించిన గుంటిపైనుండి దిగి గుంపులో జొచ్చి ఒక్కొక్కరిని తనదారి కడ్డముండిన వారిని భుజముల దట్టుచు "నన్ను కలిసికొనుడు, వచ్చిచూడుడు" అని చెప్పుచు వెళ్లెను.

* * * * * *

ఆ యూరి వంకలో నొక మొలికలో నిర్మల సైకతస్థలిని ఒక్కరేయే వాది ముద్దుగుమ్మ తన మనోహరుని యంకమున బరుండి పొరలాడుచుండెను.

"ఆ తెల్లదొర పాదిరీ చెప్పింది వింటివా చెంగీ ?" అని యత డడిగెను. చెంగి అందముగ అవులించినది. తరుణ తాళఫల సదృశమైన నొక గుబ్బతో నాటలాడుచున్న వానిచేతిని నొక్కుచు "మనమిట్లుండిన పాపము వచ్చునటకదా?" అని తనగుబురుపారిన కనుబొమలు నుదురంతయు నాక్రమించుకొను నట్లెత్తి ప్రశ్నించెను. ఆ ప్రశ్నలో సంపూర్ణమగు మౌగ్ధ్యము వ్యక్తపడుచుండెను

గుండుగాడట్లే చెంగిపై బడి యాసుందర విగ్రహమును బీజారి కౌగిట గ్రుచ్చి "ఇది పాపమెందు కౌతుంది? ఆలూ మొగుడెట్టుంటే నేమి? ఇది పాపమని యాడ శెప్పిందంటా?" అని కొసరి కొసరి మాటాడినాడు.

అతని ఉక్కువ్రేళ్లు తన్ను పులిమి వేయుచుండగా శరీరము మనోహరముగ పులకలెత్తుచుండ చెంగి చిన్ని నవ్వుల వరాలవానను గురిపించెను. "మనం పెండ్లి శేసుకోక ఆలూ మొగుడూ ఎట్లవుతాం( పెండ్లి శేస్కుంటే పాపంవుండదు మనం ఎట్లుంటేను."

అని చెప్పిన వెంటనే మొగమును సిగ్గువలన బోరగిలవైచి అతని తొడను నోరార కబళించి మోహవివశీకృతయై కొఱికినది. గుండుగాడా వక్రాలకములను దువ్వుచు మహదానంద మగ్నుడై "చెంగి, సుబ్బి బదకదు. బదికినా నాకో బొగుమంచి వుగిలి తోసింది. మనం యీ కిరస్తాని మతంలో కల్సిపోగాం. అది గమ్మునుండి పోతుంది." అనెను.

సుబ్బి గుండుగాని మొదటి భార్య ఏదో తీరని రోగముతో పడియుండెను. ఆమె మాటెత్తినదే చెంగి చివుక్కున చెంగించి యూపలికేగి

ముఖమునిరు చేతులతో గప్పి కొనెను. గుండుగాడామెను తన కౌగిటి కీడ్చికొని చేతులావలికి ద్రోసి "ఏమి యాడవట మెందుకూ? ఇంత సంతోసంగుంటే, నేనేవంటినని నువ్వేడవటము?" అని అడిగెను.

"మనం కిరస్తాని మతంలో కలిస్తే, అది కూడా రాదూ? నాకేమో బయమేస్తావుంది. మామా నేను శేసినదంతా పాపం నిన్నూ నీపెళ్లాని యేరుసేశినా, ఇప్పుడు నీ బుద్ధి సెర్శినా నీ కాపరం పాడయి పోయింది. నన్ను నరికెయ్ నీ శేతుల్లో ప్యాణం పోతేసాలు." అని చెంగి వెక్కి వెక్కి యేడువ సాగెను.

గుండుగాని గుండెకరగినది. "చెంగీ, మనం కిరస్తానీ మతంలో కల్సినా, కలవక పోయినా, నుబ్బి మనజోలికిరాదు. నాకు సత్తెప్పె మానం శేసింది. ఒక్కాలు కాట్లోవుంది. మీసుగానికి నాను అడ్డం తగల్ను మామా అని సెప్పేసింది. అనేక నువ్వేమీపాపం శెయ్‌లే. సేసిందంతా నాను నాబుద్ధెమి నూ శెలిపలే. నా సెందుకు నిన్ను వరకాలో తెల్లే నాబంగారు పిచ్చికని, నాసూపుల్లో యెలుగును. నాప్యానాల్లో ప్యానాన్ని, నిన్ను చెంగీ, నాను నరికేసి యేమయ్ పొయ్యేది?"

"అందుకాదు? నాపాపానికంతుందా? పెళ్లవకముందే నీతో–" ఏడుపు మగల నారంభించెను.

"యేమయింది నాతోవుంటే పెండ్లాడ తానుగా?"

"అదికాదు. నాకు రెండు నెలలు తప్పింది." చెంగి వెక్కి వెక్కి వచ్చునేడుపును ఆపలేకపోయినది. "గుంటినుండో గుంటులోనో పడి చస్తాను మామా నన్ను మర్సిపోనువ్వు"

గుండుగాడట్లే నిర్ఘాంత పడి నిలిచినాడు. హృదయము కరగికన్నుల గుండా వెల్లువలుగట్టి ప్రవహింప నారంభించినది. ఆలోచించినాడు జీవిత సమస్యను తీవ్రముగ తన తీర్మానమిట్లు వచించినాడు. "చెంగీ, నీవు నేను ఈ ఫాదిరీదగ్గిరికిపోయి జరిగిందంతా సెప్పేస్తాం పెద్దోళ్లెవురు తెల్సుకోక ముందే ఆయన్నడిగేస్తాం అనేకేమాతుందో అయ్యేది కానీ."

"నానూ చెప్పాలనుకొన్నా నానొక్కతో పోతాను. నువ్వొద్దులోగా" "సరే, మరి పదాంపద అడకి"

*　　*　　*　　*　　*　　*

ఏనాది పాళెములో నిల్లు చిక్కుట కష్టమే. నాలుగణాల బాడుగకు ఒక చిన్ని గుడిసె చిక్కినది మన పాదిరీ దొరగారికి. ఒక చిన్న

వెదురుతలుపు బోనుతలుపువలె నాగుడిసెకు గలదు. ఒకమూల క్యాంపు మంచము, దాని ప్రక్కన ఒక సూటుకేసు కుర్చీకి బదులుగ నుపయోగించి కొని పాదిరీ కూర్చొని లోపల వచ్చువారికి మంచిమాటల గొందఱకు, మందుల గొందఱకు, మతమును గొందఱకు బంచిపెట్టుచుండెను. తలుపు తట్టిన శబ్దము వినినది.

"పాపాత్మా, లోపలరమ్ము" పెద్దబొంతను నిండుముసుగుపెట్టి ఒకవ్యక్తిలోపల ప్రవేశించి తప్పటడుగులు పెట్టుచు నతని సమీపించి నిలువలేక కాబోలును చదికిలబడెను.

పాదిరీ ఆత్రముతో నావ్యక్తిని సమీపించి "ఏమి? నీసంగతేమి?" అని అడిగెను.

"మందు దగ్గుమందు" అని కేకరించి దగ్గు లినుమడించుచుండ దీనముగ నడిగెను.

పాదిరీ రోగిని బరీక్షించి నోరు చప్పరించి "మందక్కఱలేదు. మతమును మాత్రము పుచ్చుకో స్వర్గానికి పోగలవు." అని నిర్వచించెను.

రోగి భయకంపిత స్వరముతో మీ దేముడుకూడ ఉపయోగంలేనోడేనా? అని అడిగెను.

"బుద్ధిలేనిదానా, మా దేముడు స్వర్గమును ఎప్పుడువచ్చినను ఇచ్చును. కడమ దేవుళ్లదికూడ లేదు. పోనిమ్ము, నీకడ డబ్బేమాత్రమున్నది?"

"దుడ్డెందుకూ?"

"కానుక దేవునికి. కానుక లేక వట్టిచేతులతో రావచ్చునా? తీర్థమిచ్చెదను. మందిచ్చెదను. నీఅదృష్టము మా దేవునికరుణ ఎట్లుండునో చూతము."

"ఆమాత్రం దైర్నమిస్తేసాలు. ఇదో దుడ్డు. ఎంతుందో ఎంచుకో." అని ఒక మంటి బుడిగ, పసుపుగుడ్డ కొంగమునకు జుట్టియుంచినది ఆతని చేతికిచ్చి "ఇది ఏల్నివాడికి ముడుపులు మీదులు" అని చెప్పెను.

పాదిరీ దానిని తీసికొని బరువుగ నున్నదనుకొనినాడు. వెంటనే కరుణ చిప్పిలునట్లు రోగిని మేనెల్లతడవి తాజాచేసి "నీరోగము పోయినది. దేవుడు నీపై కరుణించుచున్నాడు" అని ధైర్యవచనముల నుడివి ఏదోమందిచ్చి తీర్థమిచ్చి పొమ్మనెను.

రోగికి కొంచెము మనసు కుదుటకొన్నదని యేచెప్పవలయును. ఆమె లేచి సంతోషముగ కాళ్లీడ్చికొనుచు వెళ్లెను.

తలుపు తెఱచినతోడనే యారోగికి చెంగి కన్పడినది. ముసుగులో నున్నందువలన తన మొగము చిట్లింతను చెంగి చూడలేదు. రోగిమాత్రము పోయినట్లుపోయి గుడిసె పై పునకే మరలివచ్చెను. వెలుపలికి వచ్చుచు రోగి తలుపు తెరచి యుంచుటచే చెంగి లోన నిరభ్యంతరముగ ప్రవేశించెను.

పాదిరీదొర ముడుపువిప్పి రాగిడబ్బుల నెంచికొనుచుండెను. చెంగి లోపల ప్రవేశించినది. ఆమె సమీపించిన పిదపనే తెలిసినది. కొంచెము కోపము తోచునట్లుగా "తలుపుతట్టి రమ్మన్ననే రావలయును" అని కసరినాడు.

చెంగి అతని కసరింతను లెక్కపెట్టలేదు. కన్నులశ్రువులతో నిండియున్నవి. తటాలున నామె నేలకువంగి "దణ్ణాలు దొరగారూ. రక్షించండి పాపిష్టిని" అనుచు నమస్కరించెను.

ఆ వంగునప్పుడు కంచుకరహితమైన యురోజములా పైటు నవలికి నెట్టివైచినవి ఆదృశ్యమును జూచిన పాదిరీగుండె లొక్కసారి "గభిక్కు" మన్నది. చామనచాయ మేని తారళ్యము కనుల మిఱుమిట్లు గొలుపుచుండ నోరు తడబడ "పాపాత్మురాలా, దేవుడు నీమొఱవినుచున్నాడు. నీసంగతేమోవిశదముగ చెప్పికొనవచ్చును" అని సెలవిచ్చినాడు.

చెంగి అతని పాదములకడ కూర్చొని తనకు గుండుగానికినున్న సంగతంతయు ముగ్ధత్వముట్టిపడ సమగ్రముగ వచియించెను. పెండ్లికాకముందేర్పడ్డ తన దుస్థితికి ప్రాయశ్చిత్తము క్రైస్తవమతమున నేమిచెప్పబడినది ? అని ప్రశ్నించెను.

పాదిరీ యామె వచించునది వినుచు నా చెక్కి తీర్చిన సుందర మనోహర విగ్రహము నాపాదమస్తకము పరిశీలించుచుండెను. సహజ సౌందర్యమునకు నగలేల? విలువ వలువలేల ? మనసున నేదో విధముగ వికార ముదయించినది అతనికి. చెంగి వెడద కందోయి, చిగురు పెదవి, యుబ్బుచెక్కిళ్లు, చాకలెట్ల గుట్టలవంటి యాచందోయి నొక్కసారిగ కబళింపవలయునని శివమెత్త నారంభించెను.

పిల్లా నీయపరాధమును మాదేవుడు క్షమించును. నేను నిన్ను అతనికి సిపార్సు చేసెదను. నీకు దేవునిదయ కలుగునట్లు నేను నీశరీరమును పవిత్రమొనరించెదను. లెమ్ము. ఈచోట పరుండుము" అని క్యాంపుమంచము చూపి.బిరబిర వెళ్ళి తెఱచియుంచి యుండిన వెదురుతలుపునుమూసి లోని కువ్వంపుగొళ్లెము పెట్టివచ్చినాడు. అంతలో నామాధ్యంపు చిన్నది ఆతూ

కాళీతల్పమున శరీరమును వెల్లవెలికిల బూడ్చివైచి పాపమునకు బాచితి నెదురుచూచుచుండెను.

ఫాదిరీకి తలగింగు రెత్తుచుండెను. ఎన్నో వత్సరములు తన భౌతిక శరీరమునకు బరిత్యజించి వైచిన యాయమృతోపమాన బ్రహ్మానందానుభవమున కిట్టి తరుణము నిట్టి తరుణియు లభించెనని యంతరాత్మ సంబోధించుచుండ నాతఁడొక్క సీసాలోని తైలమును మునివ్రేళ్లనద్దికొని చెంగినిసమీపించెను విస్ఫారితనయనములతో నాయువతి వానిని వీక్షించుచుండెను.

'నీకీ యమృతతైలమును మర్దించి నీయవయవముల బునీతమొనర్చెదను అనుచు నరవడిన పైట నూడదీసి తనకు దోచినచోటెల్ల నామదవతికి మర్దనము కావించినాడు. చెంగియు గొంతసఱకస్లైట కొయ్యబారి నిశ్చేష్టితయై పడియుండెను. ఫాదిరీ కంతటితో తృప్తికలుగలేదు. తటాలున దాను వివస్త్రుడై చెంగిని కౌఁగిలించెను

అప్పటికి చెంగికి వానితంతు మనసునకు దట్టెను కాబోలు. తనచిన్ని కూనల దాకినవానిపై నుఱికెడు సివంగివలె నొక్కఱపఱచి కాలితో గాఢముగ వాని బొమ్మున దన్నెను. వాడాతాపునకు వెల్లకిలబడి విలవిల తన్నుకొనుచుండగా చెంగిలేచి బిరబిర తలుపుదెఱచికొని పలాయన మాచరించెను.

* * * * * *


పాదిరీ చావునకు చెంగి కారకురాలనియు నదియే వాని నేమరించి చంపెననియు తీర్మానింపబడినది. చెంగి యాగుడిసెనుండి తల విరియబోసికొని పాఱిపోవుచుండుటను పలువురు చూచిరట. చెంగిమాటల నెవ్వరు నమ్మలేదు. మీదుమిక్కిలి భ్రష్టయని యందఱామె నేవగించికొనిరి. గుండుగాని సాక్ష్యమును దృఢీకరించిరి. చెంగిని పోలీసుల కప్పగించిరి. ఉరిదీయుటకు దీసికొనివెళ్లుచుండగా గుండుగాడడ్డపడెను. పోలీసులు వానిని చావగొట్టిరి. ఇంతలో సుబ్బి (గుండుగానిభార్య) రొజుచు బరువెత్తుకొని యటకు వచ్చెను.

“చెంగిని వొదిలేయండి. నానంతాసూసినా నాను ముడుపు చెల్లించేశి వస్తావుంటే చెంగి లోగాపోయింది నాను సూశినా. ఆనేక పాదిరీ తలుపేసుకొంటే ఏంజేస్తుందో సూద్దామని తలుపుసందుల్లో నుంచి సూస్తావుంటి. పాదిరీనూనెపూశి చెంగిపైనబడి శెడ్డపని శెయ్యాలనుకొన్నాడు. చెంగి కాళ్లు జాడించి తేశింది. ఆపోకిరిదొర యెనిక్కపడిపోయినాడు.” ఈమాటలు కేసును తలక్రిందు చేసినది

మరల విచారణ జరిగినది. సుబ్బి సాక్ష్యము నందరు విశ్వసించి చెంగిని వదలివేసిరి. నిర్దోషియని ఋజువయినదే చెంగిని గుండుగాడు కుల ము పెద్దలందరి యనుమతిచే పెండ్లాడినాడు. కాని చెంగిమాత్రము "సుబ్బక్క సావకుంటే మేమింకా బగుసంతోసంగుండేవాళ్లము" అనుచుండెను.

---

## గణిత చిత్ర ప్రశ్న.




ఇదియొక రాజుగారి గుఱ్ఱపుసాల. ఆరాజు ప్రతిదిన ముదయమును, సాయంకాలమును వచ్చి మూలలయందు నిలిచి ఒక్కొక్కవైపునను 12 వంతున గుఱ్ఱములుండుటను చూచును. ఒక్కనాడు దొంగ యొకడు నాల్గు గుఱ్ఱములను తీసికొనివెళ్లెను. ఉదయమున కావలివాడు రాజు రాగలడని తొందఱచే ఒక్కొక్కవైపున 12 గుఱ్ఱములుండునట్లుగా కట్టియుంచెను. ఆనాడు వ్యాధిచే రెండు గుఱ్ఱములు చచ్చినవి. యోచించినాడు 12 వచ్చునట్లు మరల కట్టియుంచెను

రాజు ఆనాడు మొదలు 12 దినములు దినమునకు రెండు గుఱ్ఱముల వంతున కొని యిచ్చుచుండెను. ఆకావలివాడు ప్రతిదినమును ఏవైపున చూచినను 12 గుఱ్ఱములుండునట్లు కట్టుచుండెను.

*N. B.* ఆ కట్టినవిధమెట్లు ?

(మధ్య ఏ చోటను ఖాళీయుండరాదు.)

అంకెలను ఇష్టమువచ్చినట్లు మార్చుకొనవచ్చును.

# విజ్ఞానము.

హాలీవుడ్ లో ప్రతి ఫిల్ము తయారు చేయుటకు అగుకాలము సగటున ఇరువైరోజులు ఉండును.

*　　　*　　　*　　　*

ప్రతిసంవత్సరము బ్రిటన్ లో పదిలక్షలకు పయిగా గోడుగులు పారపోవుచుండును.

*　　　*　　　*　　　*

మెదడులన్నిటిలోను ఎక్కువ బరువైన మెదడు ఆలివర్ క్రామ్ వెల్ ది. అతని మెదడు సుమారు తొంబదిఅవున్సులు తూగెను.

*　　　*　　　*　　　*

ప్రపంచమున కంతటికి పెద్దవంతెన ఆక్లండువంతెన. దానిపొడవు ఎనిమిదిమైళ్లు, వ్యయము ఇరువది మూడుకోట్ల పదిలక్షల రూపాయలు. 1930 వ సంవత్సరములో కట్టడము ఆరంభించిరి. 12—11—1936 నాటికి ముగిసినది.

*　　　*　　　*　　　*

ప్రెసిడెంట్ రూజ్ వెల్టు ఒకరోజున 1,25,000 ఉత్తరములు అందు కొన్నాడు.

*　　　*　　　*　　　*

ఇంగ్లాండు దేశములో ప్రతిపిచ్చివానికోసరము వారానికి పదునాలు రూపాయలు ఖర్చు చేసెదరు.

*　　　*　　　*　　　*

భవనములన్నిటిలోను పెద్దదయిన భవనము న్యూయార్కునగరములో నున్నది. దానిఎత్తు 1250 అడుగులు. నూటఅయిదు అంతస్తులందున్నవి.

*　　　*　　　*　　　*

ఒకరష్యను పెద్దమనుష్యుడు ఆరుసంవత్సరాలలో ఏబదిఎనిమిది వివాహాలు చేసికొని నూటయిద్దరుబిడ్డలకు తండ్రి అయినాడు. ఏబదితొమ్మిదవ వివాహము చేసికొందామని ప్రయత్నించుచుండగా గవర్నమెంటతనికి పది సంవత్సరములు శిక్షవిధించినది.

*　　　*　　　*　　　*

అమెరికాలోని వోబిర్లన్ కాలేజిలో కోఎడ్యుకేషన్ [పొత్తుచదువు] 1837 సంవత్సరములో మొదలు పెట్టిరి అనగా ఒక శతాబ్దము అయినదన్న

మాట. ఈనాడు అమెరికాలోని కాలేజీలన్నిటిలోను కో ఎడ్యుకేషనే!

* * * *

ప్రపంచములోని గడియారములన్నిటిలోను పెద్దదయిన గడియారము మాంట్రియల్ నగరములోనున్నది. దాని వ్యాసరేఖ (Diameter) అరు వది అడుగులు బరువు 6 టన్నులు.

* * * *

మోటారు బైసిక్కిళ్లలోనూటికిఎనుబదిఅయిదుపాళ్లు యూరప్ లోనేఉన్నది.

* * * *

కొంతకాలముక్రితము జార్జిఫ్రెడరిక్ గ్రేఅను సర్రేనివాసి (వయస్సు 51 సంవత్సరములు) దోమ కాటువలన చనిపోయినాడు.

* * * *

అమెరికాలో దొంగతనము కూడ ఒకవృత్తి. అక్కడ సగటున ప్రతి నలువదినిమిషాలకు ఒకఖూనీ చొప్పున జరుగుచునుండును. అమెరికను గవర్నమెంటు సంవత్సరానికి 1300 కోట్ల డాలర్ల చొప్పున రాజశాస నోల్లంఘనము చేయువారిని శిక్షించుటకు వ్యయపరుచుచున్నది.

* * * *

అయిస్ నీళ్లు ఎక్కువగ త్రాగిన కన్నులకు జబ్బు వచ్చునట.

# నాగసర్పము పైపుత్ర వాత్సల్యము.

A. వీరభద్రపిళ్లగారు.

నరసింగరాయనిపేటకు సమీపమున గోళ్లవారిపల్లె యనుగ్రామమున బొందిమందిడి కూతురు, గొల్లఅక్కమ్మ అను డెబ్బది యేండ్ల ముసలామె గలదు. ఆమె కూరాకు దినుసులు తెచ్చి యమ్మి జీవించునది. ప్రతిదినము తన సంపాదనలో కొంతభాగమునకు, పాలను, కోడిగ్రుడ్లను కొనిపోయి తనయింటియందలి పుట్టలోని నాగన్న కర్పించి తనవద్ద పరుండబెట్టుకొను చుండునట. ఆమె యేమరియున్నను రాత్రులందు వెదకికొనిపోయి యామె కడ నిర్భయముగా నాగన్న పరుండునట.

ఇట్లు చాలకాలమునుండి జరుగుచుండి యిప్పుడు మూడు వారము లుగా కనబడలేదని దానినెవరైన చంపిరేమోయని యామె దుఃఖించు చున్నది. పల్లెటూళ్లలో పెక్కండ్ర యిండ్లలో పుట్టలున్నవి. ఇట్టికథలు అప్పటప్పటు వినఁబడుచున్నవి.

# లోకజ్ఞానము.

చలికాలములోకంటె వేసవికాలములో మానవుల తూకము ఎక్కువగ నుండును.

---

వాషింగుటనులో దాదాపు ఆరుగురు పత్రికా సంపాదకులు సంవత్సరమునకు 15000 ల డాలర్లకు పైగా జీతమును తీసికొనుచున్నారు. చికాగో ట్రిబ్యూను ప్రధాన పత్రికా ప్రతినిధికి సంవత్సరమునకు జీతము 22000 డాలర్లు. న్యూయార్కు టైమ్సు ప్రతినిధికి 18000 ల డాలర్లు.

---

జర్మను రసాయన శాస్త్రజ్ఞులు కలపనుండి ఒకవిధమైన కొవ్వును తీయగలిగిరి. ఈ కొవ్వునుండి యంత్రములకు పనికివచ్చు జిగటుపదార్థము తయారు చేయబడినది. ఇంకను మరికొన్ని పరిశోధనలనుసలిపి ఈ జిగురునుండి ఆహారముగా పనికివచ్చు మరియొక పదార్థమును కనుగొనినారట. దీనిని ప్రస్తుతము జర్మను ఖైదీలకు ఇచ్చుచున్నారు.

---

పోలండులో వార్సానందు 3000 మంది సభ్యులతో తస్కరుల భీమాకంపెనీ ఒకటి స్థాపించబడినది! ఈ సభ్యులు తప్పకుండా కంపెనీకి ప్రీమియములు పంపుచుందురు వీరు అరెస్టుచేయబడినచో కంపెనీవారు కేసువిచారణకగు ఖర్చులను చెల్లించెదరట! శిక్ష ననుభవించుచున్నంతకాలము వీరికి కంపెనీవారు ప్రత్యేకముగా కొంత ఆహారమును ఇచ్చెదరు.

---

క్రోయిడనునందు ఒక కాలువలో సౌందర్యవతులు కొందరు ఈతలాడుకొనుచుందురు. ఆప్రక్కనున్న రోడ్డుమీదుగా కార్లను నడపువారు వీరిని చూచుట తటస్థించుచుండును. అందువలన కార్లకు కొన్ని అపాయములు సంభవించుచున్నవి. ఆ కాలువచుట్టు ఒక తెరను ఏర్పాటుచేయవలసినదిగా అక్కడి ప్రజలు క్రోయిడను కార్పొరేషనువారిని కోరదలచిరి. అట్లొనర్చుచో ఈదుచుండు సౌందర్యవతులను డ్రైవరులుచూచుట మానుదురని వారి అభిప్రాయము.

---

ఫ్రాన్సిసుసెల్ అను నొక రోమనుకేథలిక్కు ఉబుసుపోకకై అనేకమంది స్త్రీలను కొననారంభించెను. వీరందరు అతనికి భార్యలగుచుండిరి. ఒకొక్క కన్యను 2 పౌనులకు కొనెడివాడట. 23 సంవత్సరము

లలో ఇతడీవిధముగా 141 మంది స్త్రీలను కొనెను. 1914 నుండి ఈతడీ వ్యాపారమును చేయుచున్నాడట.

---

జాం నగరులోనున్న ఒక మహమ్మదీయ ఋషి సమస్త వ్యాధులను అతి విచిత్రముగా పోగొట్టుచున్నాడు. నీళ్లలో తన చేతులనుముంచి దానితో ఈ ఋషి రోగులను తాకుచుండును. అంతమాత్రముననే వారి రోగములు నయమగుచున్నవి. ఈ విధముగా అనేకమంది కుష్ఠురోగులకు వీరు వ్యాధులను పోగట్టగలిగిరి. చాలమంది గ్రుడ్డివారికి కూడ కంటిచూపు వచ్చినది. ఈ ఋషి తాకిననీళ్లను కొన్నిసీసాలలోనికి పట్టి వానిని భారత దేశములోని యితర ప్రాంతములకు, ఆఫ్రికాకు పంపుచున్నారు.

---

యునైటెడుస్టేట్సులో 40 లక్షలమంది నేరస్థులు గలరట 1936 లో ప్రతి 26 సెకండ్లకు ఒకహత్యచేయబడినది 13000 లకు పైగా కూనీ కేసులు విచారణ చేయబడినవి. పరులమానమునకు భంగము కలిగించిన నేరముక్రింద 7881 మంది అరెస్టుచేయబడిరి. బందిపోటు దొంగతనము చేసినందుకు 34300 మంది శిక్షింపబడిరి. నేరములు చేయుటవలన స్థిరచరాస్తులకు కలుగుచున్న నష్టము దోషులను శిక్షించుటకు పోలీసు శాఖను ఏర్పాటుచేయుటకు కారాగృహములను నిర్మించుటకు మొత్తము నిమిషమునకు 1000 పౌనులకంటె ఎక్కువ వ్యయమగుచున్నది.

---

న్యూయార్కునందు ఒక ప్రాథమిక పాఠశాలలో 28 సంవత్సరముల వయస్సుగల ఒక స్త్రీ చదువుకొనుచున్నది. ఆరేండ్లప్రాయముగల ఈమె కుమార్తెకూడా మరియొకబడిలో విద్యనభ్యసించుచున్నది. తల్లి రెండవక్లాసులో చదువుచుండ బిడ్డ మూడవతరగతిలో చదువుచున్నదట. పాఠశాలలేని గ్రామములో పుట్టి పెరిగినదగుటచే ఆమెకు బాల్యమందున విద్య నభ్యసించుటకు అవకాశము కలుగదయ్యెను. తన బిడ్డకు చదువుచెప్పు సందర్భములో ఒకరోజున ఈమె చదువుటలోను, వ్రాయుటలోను తనకు గల అశక్తతను గుర్తించినది. అంతట ఈమె పాఠశాలకుబోయి అక్కడ విద్యనభ్యసించుటకు మొదలిడెను. ఇప్పుడు తల్లి బిడ్డ కలసి ఇంటివద్ద హోముపర్కు చేసికొనుచున్నారు.

---

# నెల దినములు

## తుంగభద్రా ప్రాజెక్టు.

గౌ॥ సి. రాజగోపాలాచార్యులును, గౌ॥ యాకూబ్ హుస్సేను గారును నవంబరు 27 తేదినాడు మద్రాసు కేతెంచిన నిజామునుండి వచ్చిన ప్రెసిడెంట్ రైట్ ఆనబుల్ సర్. అక్బర్ హైదరీవారితో తుంగభద్రానదికి అనకట్టకట్టు విషయమై సంభాషణలు సాగించిరి. నిజాం ప్రభుత్వ మీవిషయమున సుముఖమైయున్నదని తెలియుట సంతోషము.

* * * * *

## మహాత్మగాంధీగారు.

మహాత్మగాంధిగారు కల్కత్తాలో జరిగిన అఖిలభారత క్రాంగెస్ మహాసభ తరపున జరిగిన సభలో పాల్గొన్నందువలన నీరసముకలిగి మిక్కిలి బాధపడిరి. వారి ఆరోగ్యమధికముగ నిట్టుమున్నెన్నడును శిథిలమైయుండ లేదు. వారికి సంపూర్ణ విశ్రాంతి నిచ్చుచున్నారు. బిర్లా ధనపతి స్వయముగ మహాత్మునకు సేవ చేయుచున్నాడు.

* * * * *

మదరాసు ప్రాంతమున నవంబరు నడుమగురిసిన కుంభవృష్టి అపార నష్టముకలిగించినది. ఎం. ఎస్. ఎం. లోను ఎస్. ఐ. ఆర్. లోను రైలు పట్టాలు తెగిచాల కష్టనష్టములు కలిగించినది. పెరంబూరు, కొరుకుపేట ప్రాంతముల ప్రజల యిండ్లన్నియు కూలిపోయి వీధులలో పడవలలో తిరుగాడవలసి వచ్చినది.

# జగదీశచంద్రబోసు.

ప్రపంచమున సుప్రసిద్ధులైన జగదీశచంద్రబోసుగారు నవంబరునెల 24 తేదినాడు గుండెరోగమున మరణించిరి. అతని పుట్టుక 1858 నవంబరు 30 తేది. వృక్షశాస్త్రమున వీరుచేసినకృషి తత్ఫలితములోకములో మరెవ్వరుచేసియుండలేదు. వృక్షముల భాష నే అవగతముచేసికొని ప్రపంచమునకు నిరూపించిన మహాసీయు డితడు. వీరియాత్మకు శాంతికలుగుగాక.

బెంగాలు డిన్యూల విడుదల విషయములందు బాల్గొనుచున్నారను నెపమున రాజకీయముగ కొన్నివేలమందిని విచారణలేని ఖైదునసుంచిన డెన్యూలను దాదాపు 1500 మంది విడుదలచేయబడుదురని కల్కత్తా ప్రభుత్వమువారు ఫర్మానా చేసినారు. వారి మంచినడవడికి గాంధిగారు పూచీనిచ్చినందువలన నీత్యాగమును ప్రభుత్వము చూపెనని తెలియుచున్నది.

* * * * *

# నీల్ విగ్రహము మదరాసు.

నవంబరు 22 తేదిరాత్రి మౌంటురోడ్డుననుండిన ఈ విగ్రహమును ప్రభుత్వమువారు పెకలించి మ్యూజియము ఆవరణమునకు గొంపోయిరి. అచ్చట ప్రతిష్ఠించుటవలన దానికి దేవాలయములోని విగ్రహమునకు వ్లె శాశ్వతమయిన యారాధనక్రమము అపాదిల్లునేకాని ఆందోళనమువలన కలిగిన లాభమేమియులేదని పలువురభిప్రాయ పడుచున్నారు.

ఇటీవలలండను కామన్సు సభలోదానిని లండనుకే తీసికొని వెళ్ళిన బాగని సంప్రతింపులు జరిగినవి.

* * * * *

బొంబాయి సుప్రసిద్ధ కాంగ్రెసు సోషలిస్టు నాయకుడగు శ్రీ॥ బాట్లివాలాగారిని రాజద్రోహపునేరమునకై విచారించిన నెల్లూరుజిల్లా జడ్జీగారు 6 నెలల విడి ఖైదు 'ఏ' తరగతిలో నుండునట్లువిధించిరి. వెంటనే బాట్లీవాలాగారు హైకోర్టునకు అప్పీలుచేయగా విచారణవఱకు పూర్వమువలె జామీను పైవిడుదల గావింపబడిరి.

---

# Tenugu Talli Mathematical Puzzle No. 2

**Good luck ! - Rs 20 must be won. Try & get !!**

**Entrance fee per entry Annas 4 only.**

**Last date of receipt 15th January 1938.**

**Results in Tenugu Talli of Feb. 1938 issue.**

FILL IN THIS COUPON

| | | | |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |

Arrange the numbers from 1 to 17 (both inclusive) in the given square such that, each row, column & diagonals total up 37. Each number should be used only once. Prize amount will be divided equally in case of ties. Correct solution is the one which agrees with the sealed key solution.

N. B:—Tenugu Talli, will be sent free of cost for 1 year to all competitors who send four or more entries, at one time whether their solutions agree with the sealed key solution or not, provided they make up 37 any how, without repetition of said numbers. The entrance fee in case of a single entry, should be sent through Postal or Money Orders. Stamps must be enclosed for all correspondence. The Manager's decision is final & legally binding.

*The Manager,*

**TENUGU TALLI.**

All Communications to:—

**(Puzzle Department,)**

***P. O. Chittoor.***

# తెనుఁగుతల్లి పోటీపరీక్ష నెం. 2.

మంచియదృష్టము! 20 రూ బహుమతి. ప్రయత్నింపుఁడు!!

ప్రవేశపు రుసుము ఒక్కొక్కటికి నాలుగు అణాలు.

ఉత్తరములు చేరవలసిన కడపటిదినము 15—1—1938.

ఫలితములు 1938 ఫిబ్రవరి తెనుఁగు తల్లిలో ప్రకటింపఁబడును.

| | | | |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |
| | | | |

### పద్ధతి.

ఈ పదునాఱు చదరపు గదులలో 1 నుండి 17 వఱకుఁగల అంకెలు, వేసినయంకె మరల వేయక, పూరించుచురావలయును. క్రిందకి పైకిని, ప్రక్కలకును మూలలకును, కూడిన 37 రావయును.

ఉత్తరములన్నియు తెనుఁగుతల్లి పోటీపరీక్ష నెం. 2 అను శీర్షిక యందు ఈ పత్రములలోనే యుండవలయును. పై నియమములకు లోబడి 37 సంఖ్య వచ్చు ఉత్తరములు (entries) ఒకసారిగా నాలుగుగాని, అంతకంటె ఎక్కువగాని పంపువారికి తెనుఁగుతల్లి పత్రిక ఒక సంవత్సరము ఉచితముగా పంపబడును.

సీలు చేయఁబడిన ఉత్తరములోనున్న ప్రకారము పెక్కండ్రు పంపినచో బహుమతి సగముగ పంచిపెట్టబడును. ప్రవేశపు రుసుము తపాలు ఆర్డరుగాగాని మణియార్డరుగాగాని పంపవచ్చును.

ఉత్తరప్రత్యుత్తరములు జరుపఁగోరువారు తపాలు బిళ్లలు పంపవలయును. మానేజరు చేయు పరిష్కారమే కడపటిది.

N. B:—కొందఱుకోరినందున నెం. 1. ఉత్తరములు పంపుకాలము 25—12—37 వఱకు పొడిగింపఁబడినది.

మానేజరు,
తెనుఁగుతల్లి ఆఫీసు,
(పోటీపరీక్ష శాఖ,) చిత్తూరు.

# నానా దేశ వార్తావళి.

---

## ఇంగ్లాండు:—

యుద్ధమువచ్చినచో బ్రిటనులోని ప్రజలను విషవాయువులనుండి కాపాడుటకు ఐరోపాఖండములోని యితరదేశముల వారందరికన్నను యెక్కువగా విషవాయు సంరక్షణమునకు బ్రిటిషుప్రభుత్వమువారు జాగ్రత్త పడుచున్నట్లు తెలియుచున్నది.

స్పెయిన్ విద్రోహులు స్వాధీనపరచుకొనిన రాజ్యము తరఫున ప్రతినిధిని నియమించుకొని ఫ్రాంకోకువిద్రోహ హక్కులనిచ్చుటకు బ్రిటిషు ప్రభుత్వమువారు నిశ్చయించిరి.

బెల్జియంరాజు లియొపాల్డు, ఇంగ్లాండునకువచ్చి బ్రిటిషుసార్వభౌముని అతిధిగా రెండురోజులుండివెళ్ళిరి. ఇతనిరాకకు రాజకీయమగు కారణములుగూడ కలవని రాజకీయనీతిజ్ఞులు తెలుపుచున్నారు.

బ్రిటిషుకౌన్సిలు అధ్యక్షులగుహాలిఫాక్సు ప్రభువు, జర్మనీవెళ్ళి హిట్లరుతో రాజకీయవిషయములను మాట్లాడిరి. ఈప్రసంగమువలన జర్మనీకిని బ్రిటనునకునుగల రాజకీయసమస్యలనేకములను పరిష్కరించుటకు అవకాశము గలదని రెండుదేశములవారును ఆశించుచున్నారు.

రాజ్యమునువదలుకొనిన బ్రిటిషురాజు ఎడ్వర్డును గురించినకొన్ని యపవాదులను తాను రచించినందుకు జెఫ్రీడెవిన్ అనువాతనిపై విండ్సరుడ్యూకు (పూర్వపుఎడ్వర్డు) పరువు నష్టపుదావా పడవేసెను. గ్రంధకర్త కోర్టులో క్షమాపణ తెలిపెను.

## జర్మనీ:—

జర్మనీకిప్రతికూలమగు వార్తలను ప్రచురించినందులకు రాషోక్సు అనుపత్రికారచయితను జర్మనీనుండి వెళ్లగొట్టిరి.

ఫ్రాంకుఫర్టునుండి లండనునకు బోవుచున్నవిమానము జర్మనీలోని ఆస్టెండువిమానాశ్రయమువద్ద భగ్నమాయెను. విమానమునందున్న వైమానికులుముగ్గురును ప్రయాణికులు యెనిమిదిమందియు మరణించిరి. ప్రయాణికులలో రాజకుటుంబమువారు ఆర్గురుండిరి.

## ఫ్రాన్సు:—

పత్రికావిలేఖరిరాపోర్ప్సును జర్మనీనుండి వెళ్లగొట్టినందులకు ఫ్రెంచి ప్రభుత్వమువారు అసమ్మతిని దెలిపిరి.

పారిస్సునందున్న ప్రభుత్వమును గూలద్రోయుటకు పెద్దకుట్ర జరగుచున్నది. పోలీసువారు చాలమందికుట్రదారులను, ఆయుధములను బాంబులను పట్టుకొనిరి. ఈకుట్రదారులు ఫ్రాన్సునకు రాజునొకనిని యేర్పాటు చేయుటకు పూనుకొనినట్లు బైటపడెను.

## స్పెయిను:—

స్పెయిను అంతర్యుద్ధము యింకను సాగుచునేయున్నది స్పెయిను జనసంఖ్య 14000000 లలోను ఇప్పటివరకును చనిపోయినవారును గాయపడినవారును 1000000 మందికి పైగానుండునని లెక్కలవలన తెలియుచున్నది.

స్పెయినునందు విద్రోహులకు సహాయము చేయుచున్న ఇటలీసైనికులు 150000 మంది అని స్పెయిన్ ప్రధానమంత్రి నెగ్రిన్ తెలుపుచున్నారు.

## చీనాజపానుయుద్ధము:—

చీనాజపానుయుద్ధము చాలదారుణముగ సాగుచున్నది. చీనా దేశములోని సుందరమైన సూచో నగరముపై జపానువారు 700 బాంబులను వేసిరి. నగరమంతయును ధ్వంసమైనది. చీనారాజధానియగు నాంకింగునగరమును యెట్లయినను స్వాధీనపరచుకొనవలయునని జపానువారు ప్రయత్నించుచున్నారు. చీనావారు రాజధానిని ఛంకింగునగరమునకు మార్చుచున్నారు. యుద్ధము ఆరంభమైనది మొదలు యిప్పటివరకును యెనిమిదిలక్షలమంది చీనావారు హతులైరని యుద్ధతంత్ర నిపుణులగువారు తెలుపుచున్నారు. జపానుయుద్ధవిమానములు నాంకింగునగరమును ధ్వంసముచేయుటకు ప్రయత్నించుచున్నవి.

జపానువారు తాముస్వాధీనపరచుకొనిన షాంగై నగరమున సార్వభౌమత్వమును జెంద చూచుచున్నారు. అచట ప్రకటింపబడు కొన్ని చీనాజాతీయపత్రికలను పత్రికాధిపతులు ప్రచురించుటను మానివేసిరి.

చీనావారు రష్యాదేశమునుండి 50 యుద్ధవిమానములనుకొనిరి. వీటివలన జపానువిమానములదాడిని అరికట్టుటలో చీనావారు కొంతవరకు కృతకృత్యులు కావచ్చును.

నారకింగునకు దేశమధ్యభాగమునుండి చీనాసేనలు యెక్కువగాచేరి వి. జపానువారిదాడిని ప్రతిఘటించుటయే కాక వారిని కొంత వెనుకకు రలించిరనికూడ యిప్పటి వార్తలవలన తెలియుచున్నది.

## పాలస్టయిను:—

పాలస్టయినునందుకూడ అల్లరులుశాంతింపలేదు. అరబ్బులును యూధులును పోరాడుకొనుచున్నారు. గత ఆదివారమునాడు జరిగినపోట్లాటలలో బస్సులో ప్రయాణముచేయుచున్న అరబ్బులపై యూధులు తుపాకులు కాల్పగా ఆర్గురుచనిపోయిరి; 25 మంది గాయపడిరి.

జెరుసలెమునగరమున అరబ్బుల నివాసస్థలములవైపు యూధులుగాని యూధులనివాసస్థలములవైపు అరబ్బులుగాని పోవుటలేదు. నగరమునంతటను సాయుధులగు పోలీసు గస్తీతిరుగుచున్నారు.

పాలస్తీను అరబ్బీలనాయకులగు షేక్ ఫర్హాన్ సాడి అనునతనికి మిలిటరీకోర్టువారు ఉరిశిక్షవిధించిరి.

## ఇతరదేశాలు:—

నేపాలుదేశసైన్యాధిపతి జనరల్ సర్: షంషరు జంగ్ బహదరు రాణాగారు మదరాసు మీదుగా రామేశ్వరము యాత్రవెళ్ళి మరల తమ నేపాళదేశమునకు వెళ్లినారు.

జాతిసమితి అధ్యక్షులగు గా॥ ఆగాఖాన్ గారితల్లికి జబ్బుగానుండుటచే వారును వారికుమారులు అలీఖాన్ గారును భారతదేశమునకు వచ్చిరి.

అమెరికాసంయుక్తరాష్ట్రములలోని జనరల్ మోరుటారువర్క్సు ఫాక్టరీయందును గుడ్ టయరు ఫాక్టరీయందును పనివారు సమ్మెకట్టినారు.

రష్యాసోవియట్ స్కూళ్లలో పిల్లలహింసించుచున్నారను నేరమునకు ముగ్గురు ఉపాధ్యాయులకు ప్రభుత్వమువారు ఉరిశిక్షవిధించిరి.

అబిసీనియా దేశమున ఇటాలియనులపై దేశీయులు తిరుగుబాటు చేయుచున్నారు. అందువలన ఇటలీతరఫున రాజప్రతినిధిగానుండ వలసినదని పూర్వపు అబిసీనియా చక్రవర్తిని ఇటలీ ప్రభుత్వమువారు కోరిరనియు అతడు నిరాకరించెననియు తెలియుచున్నది.

జర్మనీతరపున రష్యాలో గూఢచారులుగానున్న యిరువురు జర్మనులను రష్యాప్రభుత్వమువారు ఉరిదీసిరి.

---

# రంగులరాటము



భార్య:—(చంటిబిడ్డనుచూపి) బిడ్డ యేమనుకొనుచున్నదని మీ యభిప్రాయము.

భర్త:—ఈ రాత్రి కెళ్లేద్దునా అని.

* * * *

భర్త:—టిఫ్ఫిన్ ఏమిచేసినావు?

భార్య:—ఎరవలిదోసె.

భర్త:— అనగా ?

భార్య:—అనగా, సుబ్బమ్మగారింటి బియ్యము, రామమ్మగారింటి ఉద్దిపప్పు, మంగమ్మగారింటి ఉప్పు, చెంగమ్మగారింటి నేయి, రంగమ్మగారింటి వంటచెఱకులు అన్నమాట.

* * * *

తల్లి చుట్టములతో:— మా అబ్బాయి బడిలో హిందీ, ఇంగ్లీషు, తెనుగు, అరవము, లెక్కలు నేర్చుకొనుచున్నాడు.

ఒక చుట్టము:—అవ్వకు లెక్కలతో నమస్కారముపెట్టు, నాయనా చూచెదము.

* * * * * *

కూలి:—గుంతలో నేకదండీ చెత్తంతా పడవేయవలెను?

యజమాని:—ఔను.

కూలి:—గుంతనిండిపోయిన దండీ.

యజ:—(ఆలోచించి) సరే, గుంతను లోతు గాత్రవ్వు, సరిపోవును

* * * * *

హోటలులో నిద్రించి ఉదయమున "రాత్రి సంపూర్ణముగ నిద్ర పట్టలేదండీ ఎలుకల జగడాలు చూడలేక పోయినాను" అని పూటకూటింటివారితో ననెను. "సరే యిచ్చిన కాలురూపాయకు ఏనుగుల జగడము చూడవలెనను కొన్నావేమో" అని యతడు బదులనెను.

* * * * *

తొలికూటమినాడు మగనితో.

భార్య:—మీరు సాయంకాలం పూటు ఇక క్లబ్బు వెళ్లుటమానరు ?

భర్త:—నీవు కావలయునన్న నిలిచెదను.

భార్య:—కానిచో నెట్లు? నేను పొరుగిండ్లకు వెళ్లినపుడు ఇంటి నెవరుచూచుకొనెదరు?

* * * *

“ఏరా, నీవు ఆపిల్లతో లేచిపోయినావే వాళ్లనాయన తఱుముకొని రాలేదు.?”

“అవును వచ్చినాడు. ఇప్పుడు మాయింటనే చేరిపోయినాడు”

* * * * * *

జడ్జి:—ఇంతకు ముందు సాక్ష్యము ఇచ్చుటకు ఇచ్చటికు వచ్చియుంటివా ?

సాక్షి:—చిత్తము దేవరా.

జడ్జి:—ఏ సూట్‌లో.

సాక్షి:— తెల్లనిసూట్‌లో దేవరా.

* * *

టీచరు:—నాగరికతయన నీ యభిప్రాయమేమి ?

విద్యార్థి:-అదిచాలమంచి యభిప్రాయమేకాని దానినెవరో యొకరు ఆరంభింపవలయును

... ... ...

వంటకత్తెతో నిల్లాలు:—వంటతొందరగా కావలె. మోటారుకారు వచ్చినదే మేము సినిమాకు వెళ్లి రావలయును.

వంటకత్తె:—వంటయేమో అయిపోయినది. సినిమానుండివచ్చిన తరువాత పాత్రలు కడుగుకోవచ్చును.

* * * *

“ఎక్కడముద్దుపెట్టుమనెదరు పెదవులపైనా? చెక్కిళ్లపైనా?”

“మెడపైన లేక భుజాలపైన లేక పొట్టపైన.”

* * * *

ఫాదరిదొర:—నీకు స్వర్గమునకు పోవలయునని కోరిక లేదా?

హిందువు:—(పెదవివిరచి) లేదు అదియంత మంచిదేశముగా కనబడదు. లేకుంటె మీజాతివారు ఎప్పుడో పట్టుకొనియుండేవారు.

* * *

డిసెంబరు నెల పంచాంగము కార్తీక మార్గశిరములు.

| ఇం. | ఆం. | | యోగ. | వా. | తిథి.గం.ని. | నక్ష. గం. ని. | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | 16 | అ | బు | చ రా 1-8 | వి రా 11-48 | |
| 2 | | 17 | అ | గు | ● రా 3-4 | అనూ రా 2-15 | |
| 3 | కార్తీక బహుళము | 18 | మ | శు | ప్ర ఉ 5-15 | జ్యే ఉ 4-52 | |
| 4 | | 19 | సి | శ | ద్వి పూర్తి | మూ పూర్తి | |
| 5 | | 20 | సి అ | ఆ | ద్వి ఉ 7-29 | మూ ఉ 7-28 | |
| 6 | | 21 | మ సి | సో | తృ ఉ 9-26 | పూషా ఉ 9.53 | |
| 7 | | 22 | అ మ | మం | చ ఉ 11-5 | ఉషా మ 12-0 | |
| 8 | | 23 | అ | బు | పం మ 12-19 | శ్ర మ 1-43 | |
| 9 | | 24 | అ మ | గు | ష మ 1-3 | ధ మ 2-57 | |
| 10 | | 25 | అ | శు | స మ 1-15 | శ మ 3-40 | |
| 11 | | 26 | అ | శ | అ మ 12-57 | పూభా మ 3-56 | |
| 12 | | 27 | అ | ఆ | న మ 12-10 | ఉభా మ 3-40 | |
| 13 | | 28 | సి | సో | ద ప 10-57 | రే మ 3-3 | |
| 14 | | 29 | సి | మం | ఏ ఉ 9-22 | అ మ 2-4 | |
| 15 | | 1 | మ సి | బు | ద్వా ఉ 7-30 | భ మ 12-48 | హనుమజ్జయంతి |
| 16 | | 2 | మ | గు | చ రా 3-6 | కృ మ 12-18 | దత్తాత్రేయజయంతి |
| 17 | | 3 | అ | శు | ○ రా 12-44 | రో ఉ 9-43 | |
| 18 | | 4 | సి | శ | ప్ర రా 10-22 | మృ ఉ 8-1 | |
| 19 | | 5 | సి అ | ఆది | ద్వి రా 8-8 | ఆ6-14పు4-30 | ఆర్ద్రాదర్శనము |
| 20 | | 6 | అ | సో | తృ సా 6-2 | పు రా 3-29 | |
| 21 | మార్గశిర బహుళము | 7 | అ | మం | చ సా 4-15 | ఆ రా 2-29 | |
| 22 | | 8 | సి | బు | పం మ 2-43 | మ రా 1-44 | |
| 23 | | 9 | సి | గు | ష మ 1-36 | పు రా 1-30 | |
| 24 | | 10 | అ | శు | స మ 12-55 | ఉ రా 1-37 | |
| 25 | | 11 | మ | శ | అ మ 12-45 | హ రా 2-19 | |
| 26 | | 12 | అ | ఆ | న మ 1-3 | చి రా 3-24 | |
| 27 | | 13 | అ | సో | ద మ 1-53 | స్వా రా 5.5 | శుక్రమౌఢ్య ప్రారంభము. |
| 28 | | 14 | అ | మం | ఏ మ 3-12 | వి పూర్తి | |
| 29 | | 15 | అ | బు | ద్వా సా 4-56 | వి ఉ 7-13 | |
| 30 | | 16 | అ సి | గు | త్ర సా 6-58 | అనూ ఉ 9-37 | |
| 31 | | 17 | మ అ | శు | చ రా 9-9 | జ్యే మ 12-11 | |

# తెనుఁగుతల్లి.

సంస్థాపకులు:

వి. సి. రాజారెడ్డిగారు, వళ్లివేడు.

సంస్కారకులు:—

శ్రీయుత. ఈ. వేంకటరావుగారు,

వేంకటరామ అండుకో అధికారులు, ఏలూరు.

సభ్యులు:—

శ్రీయుత. C. అణ్ణామలై పిళ్ల గారు, పలమనేరు.
,, G. రామలింగారెడ్డిగారు, గుండ్లపల్లి.
,, N. చెంగల్ రెడ్డిగారు, మండీ, పాకాల.
,, M. V. షేక్ ముహమ్మద్ రావుతర్ గారు, పాకాల.
,, N. రంగయ్యనాయఁడుగారు, మండీ, పాకాల.
,, S. దొరసామిసెట్టిగారు, గాజులమండీ, చిత్తూరు.
,, P. రంగస్వామిగారు, బి. ఏ., తిరుమల.
,, సి. రామచంద్రారెడ్డిగారు, కత్తిరపల్లె, పళ్ళిపట్టు.
,, డి. మునిరత్నం నాయుడుగారు, వేలంజేరి.
,, పి. గోపాలరెడ్డిగారు, నెమ్మలి.
,, Dr. P. మునిరత్నంపిళ్లెగారు, L. M. P. చిత్తూరు.

# బ్యూటిలిన్

## బ్యూటిలిన్ తుషారము. (స్నో)

చందనవర్చకంటెను, ఉశీర శైత్యోపచారమునకంటెను, మంద మంద మలయమారుతవీచికలకంటెను, అత్యంత శైత్య దాయకమును మంజుల మనోజ్ఞ సురభిళోపేతమునైన మా "బ్యూటిలిన్ స్నో" (తుషారము) ను వాడిచూడుఁడు!

చెమటకాయలు, ఎండపొక్కులుగల చర్మముపై రాచిన పదినిమిషములలో మంటలు మాయమై సంపూర్ణోపశాంతి చేకూర్చును. మొటిమల మాడ్చి, ముఖమునకు సౌందర్యము నొసగును.

## బ్యూటిలిన్ నవనీతము (క్రీం).

క్షౌరానంతరము, రాత్రులందు నిదురింపబోవు నప్పుడును రాచికొనినచో ఎట్టి బిరుసుబారి ఎండిపోయిన చర్మమునకు గూడ మార్దవమును మెఱుగును కలిగించును.

ఇవి అన్ని అంగళ్లయందును లభ్యమగును. బ్యూటిలిన్ గుఱుతుగల వివిధములైన సువాసన ద్రవ్యములన్నియు ఉత్తమ తరగతికి జెందినవి. ఒక్క పర్యాయము వాడిచూచిన మీకే తెలియగలదు.

**టాయిలెట్స్ మాన్యుఫాక్చరిజ్ కంపెని,**
**లిమిటెడ్.,**
చిత్తూరు.